# రెండేళ్ల కూటమి పాలనపై ప్రజలు సంతృప్తి

పెడన జూన్18,ప్రభాతవార్త : రాజకీయం నీతిగా హుందాగా చేయాలే కాని నీతిమాలిన రాజకీయాలు వ్యక్తిగత దూషణలతో కూడిన రాజకీయాలు మానుకోవాలని పెడన నియోజకవర్గ శాసనసభ్యులు కాగిత కృష్ణప్రసాద్ సూచించారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోంమంత్రివర్యులు వంగలపూడి అనిత పై గుడివాడ అమర్‌నాథ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణప్రసాద్



ఖండించారు. కూటమిప్రభుత్వం గురువారం నిర్వహించిన కూటమిప్రభుత్వం 2ఏళ్ళ నమ్మకం అభివృద్ధి సంక్షేమం విజయోత్సవసభలో ఆయన మాట్లాడుతూ జగన్మోహనరెడ్డి ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన గుడివాడ అమర్నాథ్ హోంమంత్రిపై చేసిన అనుచిత వ్యాఖ్యలు చేయడం ఒక నీతిమాలిన చర్య అని వైసిపి నాయకులు మహిళలను ఒక ఆటబొమ్మలాగ చూస్తున్నారా అని ప్రశ్నించారు.ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా కార్యదర్శి గోపుసత్యనారాయణ,బిజెపి జిల్లా నాయకులు పుప్పాలరాము,మాగంటి గంగరాజు,జనసేన నాయకులు పంచకర్ల సురేష్,కూటమి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## బెల్ట్ షాపులపై దాడులు...ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు

కంచికచర్ల జూన్ 18 ప్రభాతవార్త ప్రతినిధి: ఎక్సైజ్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కంచికచర్ల ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని వీరులపాడు, కంచికచర్ల మండలాల పరిధిలోని గ్రామాలలో అక్రమ మద్యం అమ్మకాలు జరిపే వారిపై దాడులు నిర్వహించారు. ఈ దాడులలో కంచికచర్ల మండలంలోని కీసర గని ఆత్కూరు గ్రామాలు, వీరులపాడు మండలంలోని పొన్నవరం గ్రామంలో మొత్తం ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి మొత్తం 27 మద్యం సీసాలను స్వాధీన పర్చుకుని వారికపై క్రైమ్ నంబర్ 57/26, 58/26, 59/26 క్రింద కేసులు నమోదు చేశారు. అక్రమ మద్యం విక్రయాలు, బెల్టు షాపులు నిర్వహిస్తూ కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందని కంచికచర్ల ఎక్సైజ్ ఇన్స్పెక్టర్‌తో పాటు సిబ్బంది శ్రీనివాసు, బాబు, శివరామకృష్ణ, భాస్కర్‌లు పాల్గొన్నారు.

## రక్షించాల్సిన పోలీసులు..భక్షక భటులుగా మారారు...వైసిపి నేత వేమా సురేష్

కంచికచర్ల జూన్ 18 ప్రభాతవార్త: కంచికచర్ల పట్టణ వైసీపీ అధ్యక్షుడు వేమా సురేష్ బాబు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి పాలనలో శాంతి భద్రతలు క్షీణించాయని, రక్షించాల్సిన పోలీసులే భక్షక భటులుగా మారారని వైసిపి పట్టణ అధ్యక్షుడు వేమా సురేష్ బాబు ఆరోపించారు. ప్రభుత్వం పోలీసులు



కలిసి అమాయక యువతను బలి చేస్తున్నారని అన్నారు. విజయవాడలో గాదే సాయికృష్ణ అనే కాపు యువకుడిని కృష్ణలంక సిఐ నాగరాజు పోలీస్ స్టేషన్ కు పిలిపించి లాకప్ డెత్ చేయటమే కాకుండా, బాడినికూడా కనబడకుండా చేయటం దారుణ మన్నారు. ముఖ్యంగా కాపుల ఓటుతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా కాపులపై దాడులు, హత్యలు జరుగుతున్నా ప్రభుత్వ పెద్దలు నోరు మెదకపక పోవటం అన్యాయమన్నారు. కాపుల ఓటుతో కూటమి పాలనలో ఉప ముఖ్యమంత్రిగా ఉన్న పవన్ కళ్యాణ్ విజయవాడలో గాదె సాయికృష్ణ లాకడ్ డెత్ ఘటనపై ఇంత వకరు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. పవన్ కళ్యాణ్ పిలుపుతోనే గత ఎన్నికల్లో కాపులు కూటమికి పట్టం కట్టారన్నారు. రాష్ట్రంలో ఎక్కడ కాపులకు అన్యాయం జరిగినా పవన్ నోరు మెదపటం లేదన్నారు. లాకప్ డెత్‌కు గురైన సాయికృష్ణ కుటుంబం జనసేన పార్టీ కి చెందిన వారేనని, సొంత పార్టీ కాపులకు జరిగిన అన్యాయం గురించి స్పందించలేని పవన్ కళ్యాణ్ ఇక కాపులను కాదుగా రాష్ట్ర ప్రజలను ఏం ఉద్ధరిస్తాడని విమర్శించారు. తక్షణమే లాకప్ డెత్ చేసిన సిఐ నాగరాజు ను విధుల నుండి తప్పించటమే కాకుండా, ఆ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు . మరో పక్క మహిళలను కించ పరిస్తూ ఊరుకునేది లేదన్న పవన్ గతంలో మాజీ మంత్రులు రోజా, విడదల రజినిల్ని నోటికొచ్చినట్లు బూతులతో , వ్యక్తి గతంగా అనరాని మాటలు అన్న టిడిపి నాయకుల వ్యాఖ్యలు పవన్ కళ్యాణ్‌కు గుర్తుకు రాలేదా అని మండిపడ్డారు. మాజీ మంత్రి అమరనాథ్ హోంమంత్రిని ఏదో అన్నాడని ఇప్పుడు పవన్ మాట్లాడటం విడ్డూరంగా ఉన్నదన్నారు. అమర్ నాథ్ ఎవరిని ఉద్దేశించి అనలేదన్నారు. దీనికి స్వంత పార్టీలోని హోంమంత్రిని అనవసరంగా బయటకు లాగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## ప్రైవేట్ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు యూనిఫామ్‌ల దోపిడిపై చర్యలు తీసుకోవాలి

ఎ కొండూరు, జూన్ 18, ప్రభాతవార్త : ఎన్టీఆర్ జిల్లాలో ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాల యూనిఫామ్ల దోపిడీపై వెంటనే చర్యలు తీసుకోవాలని అలాగే స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ టీమ్ ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహించాలని రాష్ట్ర గిరిజన సంఘం నాయకులు బి.గోపిరాజు గురువారం మీడియా సమావేశంలో డిమాండ్ చేశారు. తిరువూరు



మైలవరం నియోజకవర్గాల్లోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు యూనిఫామ్‌లను అధిక ధరలకు విక్రయిస్తూ తల్లిదండ్రులపై మోయలేని ఆర్థికభారం మోపుతూ తల్లిదండ్రుల నడ్డి విరుస్తున్నారని గోపిరాజు యాజమాన్యాల తీరును తీవ్రంగా ఆక్షేపించారు. ప్రైవేట్ పాఠశాలలు నిర్ణయించిన షాపుల్లోనే పుస్తకాలు యూనిఫామ్ కొనుగోలు చేయాలని పేరెంట్స్‌పై ఒత్తిడి తీసుకొస్తున్నారని అలా కాని పక్షంలో వివిధ రకాల ఇబ్బందులకు ఒత్తిళ్లకు గురిచేస్తున్నారని గోపిరాజు విమర్శించారు. ప్రభుత్వ పాఠ్యపుస్తకాలు యూనిఫామ్‌పై నియంత్రణ తీసుకొచ్చి ఒకేవిధమైన ధరలు నిర్ణయించాలని కోరారు. ఈ ప్రైవేట్ పాఠశాలల్లో కొన్ని చోట్ల మౌలిక సదుపాయాలు కల్పించకపోయినా విద్యాశాఖాధికారులు అనుమతులు మంజూరు చేయడం శోచనీయమని గోపిరాజు విమర్శించారు. తిరువూరు మైలవరం నియోజకవర్గాల్లో తల్లిదండ్రుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని విద్యా వ్యవస్థలో పారదర్శకత తీసుకురావాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని జిల్లా విద్యాశాఖాధికారులు అనుమతులు మంజూరు చేయడం శోచనీయమని గోపిరాజు విమర్శించారు. తిరువూరు మైలవరం నియోజక వర్గాల్లో తల్లిదండ్రుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని విద్యావ్యవస్థలో పారదర్శకత తీసుకురావాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని జిల్లాలోని విద్యాశాఖాధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి భవిష్యత్తును కాపాడాలని బి.గోపిరాజు విజ్ఞప్తి చేశారు.

## ఇబ్రహీంపట్నం మైలవరం..తిరువూరు జగదల్‌పూర్ ఎన్‌హెచ్ పట్టించుకోండి

ఎ కొండూరు, జూన్ 18, ప్రభాతవార్త : దశాబ్ద కాలం క్రితం రూ.500కోట్లతో ఇబ్రహీంపట్నం మైలవరం తిరువూరు జగదల్‌పూర్ జాతీయ రహదారి-30పై చేపట్టిన విస్తరణ పనులు అస్తవ్యస్తం వల్ల ప్రజలు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ జాతీయ రహదారి-30 ఎ కొండూరు మండలం కంభంపాడు ర్యాంప్‌ల వద్ద తుమ్మచెట్లతో చిట్టడివిని తలపిస్తుండడంతో ద్విచక్ర వాహనాల చోదకులు రహదారి మార్జిన్‌లో వెళ్లే సమయంలో తుమ్మచెట్ల కంప వల్ల ర్యాంపులు కానరాక





ప్రమాదాలకు గురవుతున్నారు. అలాగే ర్యాంపుల వద్ద వ్యర్థాల వల్ల దుర్గంధం వెదజల్లడం వల్ల తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఎ కొండూరు కంభంపాడు గ్రామాల మధ్యలో ఈ హైవేపై హెచ్‌పి పెట్రోల్ బంకు వద్ద పెద్ద గుంత వల్ల కంభంపాడు బ్రిడ్జి సమీపంలో రహదారి కుంగిపోయి ఎత్తుపల్లాల వల్ల ద్విచక్ర వాహనాలు అదుపుతప్పుతున్నాయి. ఈ జాతీయ రహదారిపై ఎ కొండూరు ఇండెన్ పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న బస్‌షెల్టర్‌పై కప్పురేకు లేకపోవడంతో ప్రయాణీకులు ఎండకు ఎండుతు వానకు తడుస్తూ ఇబ్బందులు పడుతున్నారు. ఇబ్రహీంపట్నం జి కొండూరు మైలవరం ఎ కొండూరు ప్రాంతాల్లో హైవేపై పేడ దిబ్బలతో బాడవటోల్‌ప్లాజా వద్ద కోళ్ల ఫారాల్లో దుర్గందం వెదజల్లుతుండడంతో టోల్‌ప్లాజా వద్ద వాహనాలు ఆగిన సమయంలో ముక్కుపుటాలు పగిలిపోతున్నాయని పలువురు విమర్శిస్తున్నారు. ఈ ఎన్‌హెచ్-30 బాడవ టోల్ ప్లాజా అధికారులు ప్రతిరోజు టోల్ పీజు పేరుతో లక్షలాది రూపాయలు వసూలు చేస్తూ తమ తోలు వలుస్తున్నారు కాని రహదారి విస్తరణ పనులు నిర్వహణ విషయంలో 10ఏళ్లుగా విస్తరణలో భాగంగా గృహాలు తొలగించకుండా అధికారులు మీన మేషాలపై విమర్శ ఇకనైనా ఈ జాతీయ రహదారి-30పై విస్తరణ పనులు నిర్వహణ సక్రమంగా నిర్వహించే విధంగా ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# విజయవాడ వార్త



## సాయికృష్ణ కేసును సిబిఐకి ఇవ్వాలి : వైఎస్ జగన్

విజయవాడ క్రైం,జూన్ 18,ప్రభాతవార్త: లాకప్ హత్యకు గురైన గాదె సాయికృష్ణ కేసును సిబిఐకి అప్పగించాలని వైసిపి అధ్యక్షులు,మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన సాయికృష్ణ మేనమామ ఇంటికి వచ్చి అతని తల్లి విజయలక్ష్మిని కృష్ణలంకలో పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటితుడుపు చర్యగా ఐపిఎస్ అధికారితో విచారణ కమిటీని వేశారని ఎద్దేవా చేశారు. మే నెలలో సాయికృష్ణ లాకప్‌డెత్‌తో పాటు దళిత యువకుడైన క్రాంతికుమార్ కూడ కృష్ణలంక సిఐ నాగరాజు వేధింపులు తట్టుకోలేక సెల్ఫీ వీడియో తీసి గుళికల మందు త్రాగి ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. తాను చనిపోవడానికి కారణం సిఐ నాగరాజే అని సదరు



క్రాంతికుమార్ సెల్ఫీ వీడియోలో వెల్లడించారన్నారు. మే 21న ఈ సంఘటన జరిగిందన్నారు. నీ కుమారుడిని చంపేస్తున్నాని చెప్పి మరీ సిఐ నాగరాజు సాయికృష్ణను చంపేశాడంటే అతని శాడిజం బయల్పడుతోందన్నారు. నీ కొడుకు ఫొటోకు దండేసుకో అన్నాడంటే ఇంక ఫ్రెండ్లీ పోలీసింగ్ ఎక్కడుందని ఆయన మండిపడ్డారు. సాయికృష్ణ పిన్ని,న్యాయవాది కనకదుర్గ డిజిపికి ఫిర్యాదు చేస్తే దానిని సిపికి పంపి విచారణ చేయకుండా తొక్కిపెట్టారని ఆరోపించారు. దీంతో కనకదుర్గ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో హెబియస్ కార్పస్ పిటీషన్ వేయడంతో న్యాయస్థానం కోర్టులో సాయికృష్ణను హాజరుపెట్టాలని ఆదేశించిందన్నారు. సిఐ నాగరాజును తొలుత విఆర్‌కు పంపి ఆనక ప్రభుత్వం సస్పెండ్ చేయడం వెనుక అతడు నేరానికి పాల్పడ్డాడని ప్రభుత్వం చెప్పకనే చెప్పిందన్నారు. ఈ కేసులో సిఐ నుండి డిజిపి వరకు అందరిపై కేసులు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సాయికృష్ణ తప్పు చేస్తే కోర్టులో హాజరుపరిస్తే, కోర్టు విచారించి శిక్షించాలా లేదా అనేది నిర్ణయిస్తుందని,కానీ ఈ ఘటనలో పోలీసులే కోర్టు పాత్రను పోషిస్తూ వారే చిత్రహింసలు పెట్టి చంపేసి, కనీసం శవం కూడా కనబడకుండా మాయం చేశారంటే రాష్ట్రంలో శాంతి భద్రతలు ఎలా ఉన్నాయో అర్థం అవుతోందన్నారు. సిబిఐ విచారణ ద్వారానే ఈ లాకప్‌డెత్‌లో ఎవరెవరి ప్రమేయం ఉందో వెల్లడవుతుందన్నారు. విజయలక్ష్మి చేసే న్యాయపోరాటంతో పాటు ఆత్మహత్య చేసుకున్న క్రాంతికుమార్ ఘటనలో కూడ వైసిపి పూర్తి సహకారం అందిస్తుందన్నారు. మృతుడి కుటుంబ సభ్యులు జనసేన పార్టీకి చెందిన వారు కావడంతో జనసేన తూర్పు ఇన్‌ఛార్జి వచ్చి శవ రాజకీయాలు చేస్తూ బేరసారాలు చేశారంటే పరిస్థితి తేటతెల్లమవుతోందన్నారు. ఈ సమావేశంలో ఆయనతో పాటు మల్లాది విష్ణు,వైసిపి పార్టీ నాయకులు దేవినేని అవినాష్,తలశిల రఘురాం,అంబటి రాంబాబు,వంగవీటి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## గాదె సాయికృష్ణ కుటుంబానికి అంబటి పరామర్శ

విజయవాడ క్రైం,జూన్ 18,ప్రభాతవార్త: లాకప్‌డెత్‌కు గురైన గాదె సాయికృష్ణ కేసును సిబిఐకి అప్పగించాలని మాజీ మంత్రి,వైసిపి నాయకులు అంబటి రాంబాబు పేర్కొన్నారు. గురువారం ఆయనతో పాటు వైసిపి నాయకులు మల్లాది విష్ణు,వైసిపి అధ్యక్షులు దేవినేని అవినాష్,వెల్లంపల్లి శ్రీనివాస్ తదితరులు కృష్ణలంక లోని జామతోట హైస్కూలు రోడ్,రవీంద్రభారతి స్కూలు ఎదురుగా ఇంటి వద్ద తొలుత గాదె సాయికృష్ణ తల్లిని,కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాయికృష్ణ కుటుంబాన్ని ఇలాంటి సమయంలో పరామర్శించడం చాలా భాధగా ఉందన్నారు. దేశ వ్యాప్తంగా ఈ ఘటనపై చర్చ జరుగుతోందన్నారు.సాయికృష్ణ కుటుంబ సభ్యులతో మాట్లాడితే గుండెలవిసిపోయే నిజాలు తెలిసాయన్నారు. సాయికృష్ణ తల్లి ఫోన్ లాక్కొని సిగ్నల్స్ ఆధారంగా సాయికృష్ణను తీసుకువచ్చారన్నారు. తల్లి ఎంత ప్రాథేయపడినా సిఐ నాగరాజు సాయికృష్ణని వదిలేయలేదన్నారు. వ్యవస్థలు ఎంత దారుణంగా ఉన్నాయో సాయికృష్ణ లాకప్‌డెత్ ద్వారా తెలుస్తోందన్నారు. న్యాయవాద



వృత్తిలో ఉన్న సాయికృష్ణ పిన్ని కనకదుర్గ డిజిపి ఒక ఫిర్యాదు ఇచ్చారని, అ ఫిర్యాదు సిపికి అక్కడి నుండి డిసిపి వద్దకు వచ్చి చెత్తబుట్టలో చేరిందని ఆయన విమర్శించారు. ఆ స్టేషన్‌లో ఉన్న వేరే నిందితులు చెప్పిన దాని ప్రకారం సాయికృష్ణను పోలీసులు చంపేశారని తెలిసిందన్నారు. హెబియస్



కార్పస్ పిటీషన్ వేయకుండా కూడా సాయికృష్ణ కుటుంబ సభ్యులకు అనేక ఆటంకాలు పోలీసులు సృష్టించారన్నారు.సాయికృష్ణ కుటుంబ సభ్యులు చెప్పిన దాని ప్రకారం వారికి అండగా నిలిచామన్నారు. సాయికృష్ణకు క్రిమినల్ సామ్రాజ్యం ఉందని ప్రచారం చేస్తున్నారని అదే నిజమైతే అతని తల్లి గుడిసెలో ఉండి రోజు అడుక్కోవాల్సిన అవసరం ఏముందని ఆయన సూటిగా ప్రశ్నించారు. కసబ్ లాంటి వ్యక్తిని కూడా అనేక సార్లు విచారణ చేశారని ఆ చట్టాలు ఇక్కడ వర్తించవని స్పష్టమైందన్నారు. సాయికృష్ణ మృతదేహాన్ని హిందూ సాంప్రదాయం ప్రకారం దహనం చేసుకునే అవకాశం కూడా ఇవ్వలేదన్నారు.సాయికృష్ణని దారుణంగా చంపి బూడిద కూడా ఇవ్వలేదన్నారు. ఈ ఘటనలో పాల్గొన్న కానిస్టేబుల్ నునండి సిపి దాకా అందరి బండారం తేలాలన్నారు. వారు మా సామాజిక వర్గం అయితే ఏమిటి,కాకపోతే ఏమిటి,అండగా ఉంటామన్నారు. సిపికి.డిజిపికి.హోంమంత్రికి తెలియకుండా ఏమీ జరగదన్నారు. లాకప్‌డెత్ చేయడం ఒక ఎత్తైతే ఆధారాలు మాయం చేయడం ఇంకో ఉత్తని ఆయన విమర్శించారు.తూతూ మంత్రంగా ఓ అధికారిని దర్యాప్తు అధికారిగా నియమించి చేతులు దులుపుకోవాలనుకున్నారని ఆరోపించారు. సదరు స్టేషన్‌లో ఉన్న వేరే నిందితులు చెప్పిన దాని ప్రకారం సాయికృష్ణని చంపేశారని తెలిసిందన్నారు. పౌరహక్కుల సంఘాలు ముందుకొచ్చి నిలదీయాలన్నారు. మర్డర్ చేయడం ఒక ఎత్తైతే,సాక్ష్యాధారాలను మాయం చేయడం మరో ఎత్తని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు మల్లాది విష్ణు,మాజీ కార్పొరేటర్ పుప్పాల కుమారి,ఎన్టీఆర్ జిల్లా వైసిపి అధ్యక్షులు దేవినేని అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

## భారత మార్కెట్లోకి రెడ్‌మీ టర్బో 5

విజయవాడ, జూన్ 18, ప్రభాతవార్త : భారత నవతరం పవర్ యూజర్ల కోసం రెడ్‌మీ టర్బో5ను ఈనెల 19 నుండి మార్కెట్లో అందిస్తామని షావోమీ ఇండియా ప్రతినిథులు తెలిపారు. మీడియాటెక్ డైమెన్సిటీ 8500 అల్ట్రా చిప్‌సెట్, ఎల్పీడీడీఆర్5ఎక్స్ అల్ట్రా మెమరీ, యూఎఫ్ఎస్ 4.1 స్టోరేజ్, 7540 ఎంఏహెచ్ బ్యాటరీ, 100 వాట్ హైపర్‌ఛార్జ్, 27 వాట్ రివర్స్ ఛార్జింగ్, 50ఎంపి సోనీ ఐఎంఎక్స్882 ప్రధాన కెమెరా, 4కె 60ఎఫ్‌పీఎస్ వీడియో రికార్డింగ్, ఏఐ ఆధార ఎడిటింగ్ టూల్స్, 6.59 అంగుళాల 1.5కె అమోలెడ్ డిస్‌ప్లే, 120 హెడ్జ్ రిఫ్రెష్ రేట్, డాల్బీ విజన్, డాల్బీ అట్మాస్ మద్దతుతో లభించే ఈ ఫోన్ రూపొందించామన్నారు.

## విచారణాధికారిగా రాజమండ్రి ఎస్‌పి నర్సింహ కిషోర్



విజయవాడ క్రైం,జూన్ 18,ప్రభాతవార్త: రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన విజయవాడకు చెందిన గాదె సాయికృష్ణ అదృశ్యం కేసులో దర్యాప్తు అధికారిగా రాజమ ండ్రి ఎస్‌పి నర్సింహ కిషోర్‌ను ప్రభుత్వం నియామకం చేసింది. విచారణ నిమిత్తం ఆయన విజయవాడ లోని కృష్ణలంక పోలీస్‌స్టేషన్‌కు రానున్నట్లు సమాచారం.

## సాయికృష్ణ మిస్సింగ్ కేసులో కృష్ణలంక పోలీస్ స్టేషన్ సిసి టివి ఫుటేజ్‌ను భద్రపర్చాలని కోర్టు ఆదేశాలు

విజయవాడ క్రైం,జూన్ 18,ప్రభాతవార్త: సాయికృష్ణ మిస్సింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. కృష్ణలంక పోలీస్‌స్టేషన్‌కు చెందిన సిసి టివి ఫుటేజ్‌ను భద్రపర్చాలని విజయవాడ రెండవ ఎజిఎం కోర్టు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. సాయికృష్ణ తల్లి విజయలక్ష్మి ఈ పిటీషన్‌ను దాఖలు చేశారు. .సాయికృష్ణను కృష్ణలంక పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్ళి చిత్రహింసలు పెట్టారని,నిజాలు బయటకు రావాలంటే ఆధారాలను కాపాడాలని పిటీషన్‌లో ఆమె కోరింది.

## నేడు లక్ష్మీపురం మనుబోలు గార్డెన్స్‌లో టిడిపి విజయోత్సవ సభ

ఎ కొండూరు, జూన్ 18, ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రజలకు పారదర్శక పాలన అందిస్తూ రెండేళ్లు విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు లక్ష్మీపురం మనుగార్డెన్స్‌లో శుక్రవారం ఉదయం 10 గంటలకు విజయోత్సవ సభ నిర్వహిస్తున్నట్లు తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు గురువారం మీడియా సమావేశంలో తెలిపారు. ఈ విజయోత్సవ సభకు చీఫ్‌గెస్ట్‌గా విజయవాడ పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ గౌరవాధ్యక్షురాలు ఉమ్మడి కృష్ణాజిల్లా పరిషత్ మాజీ చైర్మన్ గద్దె అనురాధ పాల్గొంటారని ఎమ్మెల్యే శ్రీనివాసరావు తెలిపారు. ఈ విజయోత్సవ సభలో టిడిపి కూటమి ప్రభుత్వం గత రెండు సంవత్సరాల్లో చేసిన ప్రజా సంక్షేమం అభివృద్ధి కార్యక్రమాల అమలు రాష్ట్ర పురోగతి మరియు భవిష్యత్తు కార్యాచరణపై పాల్గొనే నాయకులు తమ తమ సందేశాలు వివరిస్తారని టిడిపి కూటమి శ్రేణుల్లో నాయకులు కార్యకర్తలు వివిధ హోదాల్లో ఉన్న ప్రజా ప్రతినిధులు యువత మహిళలు అభిమానులు సానుభూతిపరులు శ్రేయోభిలాషులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఈ సమావేశంలో పిలుపునిచ్చారు.

## నాగరాజు కుటుంబానికి 5000 రూపాయలు ఆర్థిక సాయం

తిరువూరు, జూన్ 18, ప్రభాతవార్త : తిరువూరు జంట థియేటర్ల సందులో నివాసం ఉంటున్న బిసి రజక సామాజి వర్గానికి చెందిన నాగవరపు నాగరాజు అనారోగ్యంతో ఉదయం 6 గంటలకు స్వర్గస్తులవ్వగా ముష్టికుంట్ల గ్రామంలో అంత్య క్రియలు నిర్వహించారు. నాగరాజు కుటుంబం నిరుపేదలని తెలిసి హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ స్టేట్ కన్వీనర్ కోట రాధా మేడిది సుబ్బయ్య చారిటబుల్ ట్రస్ట్ వారితో మాట్లాడి 5000 రూపాయలు ఆర్థిక సాయం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జనసేన తిరువూరు నియోజవర్గ నాయకులు ఉయ్యూరు జయప్రకాష్ నల్లూరి శ్రీనివాసరావు గారు పాల్గొనడం జరిగింది.



## హిందు స్మశాన వాటిక భూమి పూజ



తిరువూరు, జూన్ 18, ప్రభాతవార్త :తిరువూరు శివారు పి టి కొత్తూరులో గురువారం ఉదయం హరిశ్చంద్రహిందు స్మశాన వాటిక భూమి పూజ కార్యక్రమం గ్రామస్తుల ఆద్వర్యంలో ఘనంగా నిర్వహించినఅనంతరం పర్యావరణ హితం కోరుతూ స్మశానవాటికలో మొక్కలు నాటడం జరిగింది.

## విద్యుత్ పోల్‌ను ఢీకొన్న వాహనం

తిరువూరు, జూన్ 18, ప్రభాతవార్త : ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం వినగడప గ్రామ శివారులో విద్యుత్ పోల్‌ను అశోక్ లేలాండ్ వాహనం ఢీ కొనగా విద్యుత్ స్తంభం విరిగి వాహనంపై పడగా, డ్రైవర్‌కు తృటిలో ప్రమాదం తప్పి సురక్షి తంగా బయటపడ్డాడు.



## ఫిజికల్ ఎఐ యుగంలో రోబోటిక్స్‌పై ఎల్జీ ఎలక్ట్రానిక్స్ దృష్టి

విజయవాడ, జూన్ 18, ప్రభాతవార్త :ఆదేశాలు ఇస్తే స్పందించే స్థాయికే పరిమితం కాకుండా, అంతకుమించి పనిచేసే గృహ వ్యవస్థను అందించడానికి తాము ఏఐ ఆధారిత రోబోటిక్స్‌పై దృష్టిపెట్టినట్లు ఎల్జీ ఎలక్ట్రానిక్స్ ప్రతినిథులు తెలిపారు. జీరో లేబర్ హోమ్స్ కుటుంబ సభ్యులతో మరింత సమయం గడిపే అవకాశాన్ని కల్పించడమే లక్ష్యంగా క్లాయిడ్ రోబోట్ ఆవిష్కరించామన్నారు. థింక్‌తో అనుసంధానమైన గృహోపకరణాలతో కలిసి పనిచేస్తుందన్నారు.

## క్యాన్సర్ చికిత్సలో ఆధునిక విధానాలతో మెరుగైన ఫలితాలు

విజయవాడ, జూన్ 18, ప్రభాతవార్త : క్యాన్సర్ చికిత్సలో ఆధునిక వైద్య సాంకేతికతలు, నూతన



చికిత్సా విధానాలు మెరుగైన ఫలితాలు అందిస్తున్నాయని యశోద ఆసుపత్రి, సోమాజిగూడ యూనిట్ సీనియర్ కన్సల్టెంట్ సర్జికల్ ఆంకాలజిస్ట్ డా ఎస్ మధుకర్ తెలిపారు. విజయవాడలో గురువారం మీడియాతో ఆయన మాట్లాడుతూ రక్త సంబంధిత క్యాన్సర్లు, రొమ్ము క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్, జీర్ణాశయ సంబంధిత క్యాన్సర్లకు యశోద ఆసుపత్రిలో ఆధునిక చికిత్సలు అందిస్తున్నామన్నారు. సమావేశంలో డా బొల్లు శ్రీ తేజ మేడమ్, మార్కెటింగ్ ఏజీఎం వెంకటేశ్వరరావు వీరంకి, మార్కెటింగ్ మేనేజర్ రెంటాలా విజయ్ కుమార్, ఎస్ పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబ సర్వే సమాచార ధృవీకరణకు నేడు గ్రామవార్డు సభలు

విజయవాడ తూర్పు, జూన్ 18 (ప్రభాతవార్త): జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు మరియు పట్టణ స్థానిక సంస్థల పరిధిలో ఈ నెల19వ తేదీన కుటుంబ సమగ్ర సర్వే సమాచార ధృవీకరణకు గ్రామ, వార్డు సభలు నిర్వహించనున్నట్లు ఎన్టీఆర్ జిల్లాజిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ, వార్డు స్థాయిలో సిబ్బంది సేకరించిన కుటుంబ, పౌరుల సమాచారాన్ని ధృవీకరించుటకుశుక్రవారం నాడు గ్రామ సభలు మరియు వార్డు సభలు నిర్వహించనున్నారు. ఈ సభల ప్రధాన ఉద్దేశ్యం యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేలో నమోదైన కుటుంబ మరియు పౌరుల వివరాల ఖచ్చితత్వాన్ని నిర్ధారించడం. సభలలో సంబంధిత గ్రామం లేదా వార్డుకు సంబంధించిన సమాచారాన్ని ప్రజల సమక్షంలో ఉంచి, అవసరమైన సవరణలు, చేర్పులు, తొలగింపులు, క్లెయిమ్స్ మరియు అభ్యంతరాలను నమోదు చేయడం జరుగుతుంది. అందువల్ల జిల్లాలోని ప్రజలందరూ తమ గ్రామం లేదా వార్డులోశుక్రవారం నాడు నిర్వహించనున్న గ్రామ/ వార్డు సభలకు తప్పనిసరిగా హాజరై తమ కుటుంబ వివరాలను పరిశీలించి ధృవీకరిచుకోవాలని కలెక్టర్ కోరారు. వివరాలలో ఏవైనా మార్పులు అవసరమైతే మరియు అభ్యంతరాలు సంబంధిత ఆధార పత్రాలతో సభకు హాజరై తెలియజేయవచ్చన్నారు. మండల పరిషద్ అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ కార్యదర్శులు, వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలు,ఇతర సంబంధిత అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలు, ఖచ్చితమైన ప్రణాళికా రూపకల్పన, ప్రజా సేవల మెరుగైన అందుబాటుకు యు.ఎఫ్.ఎస్. డేటా అత్యంత కీలకమైనదని, అందువల్ల ప్రతి కుటుంబం ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ వివరాలను ధృవీకరించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## ఎన్టీఆర్ జిల్లాలో సాఫీగా సర్ ఓటర్ల ఇంటింటి సర్వే

విజయవాడ, జూన్ 18 (ప్రభాతవార్త) : భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ఆదేశాలు, మార్గదర్శకాల మేరకు జిల్లాలో ఓటర్ల జాబితా సమగ్ర సవరణసర్ ప్రక్రియకు సంబంధించి ఇంటింటి సర్వే సాఫీగా జరుగుతోందని, ఇప్పటివరకు బీఎల్‌వోల ద్వారా 2,74,614 ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేసినట్లు కలెక్టర్ డా. జి.లక్ష్మీశ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.సర్ ప్రక్రియకు సంబంధించి జిల్లాలో 17,13,445 మంది ఓటర్లు ఉన్నారని, బీఎల్‌వోలు ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలు అందించడంతో పాటు వాటిని నింపి తిరిగి ఇవ్వడంలో సహకరిస్తున్నారన్నారు. 10,870 ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ పూర్తయిందని వెల్లడించారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సర్ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరిగిలా నిరంతరం పర్యవేక్షిస్తున్.ట్లు తెలిపారు. ప్రక్రియను సజావుగా నిర్వహించడంలో ఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు, బీఎల్‌వోలు కీలకపాత్ర పోషించేలా దిశానిర్దేశం చేసినట్లు పేర్కొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగులంతా ఉద్యమానికి సిద్ధంకావాలి : ఏపీ జేఏసి ఎన్టీఆర్ జిల్లా చైర్మన్ బత్తిన రామకృష్ణ

విజయవాడ, జూన్ 18 (ప్రభాతవార్త) : ఉద్యోగుల హక్కుల సాధన కోసం ప్రభుత్వ ఉద్యోగులంతా ఉద్యమానికి సిద్ధం కావాలని ఏపీ జేఏసి ఎన్టీఆర్ జిల్లా చైర్మన్ బత్తిన రామకృష్ణ పిలుపునిచ్చారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఎన్టీఆర్ జిల్లా ఉద్యోగులను ఉద్యమానికి సిద్ధం చేస్తూ వారికి అవగాహన కల్పించేందుకు ఏపీ జేఏసి అమరావతి ఎన్టీఆర్ జిల్లా కమిటీ గురువారం విజయవాడలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలలో ఉద్యోగులను కలిసి పోరాట పంథా గురించి వివరించి వారికి అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా ఏపీ జేఏసి ఎన్టీఆర్ జిల్లా కార్యవర్గ సభ్యులు అయిన డి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ వెహికల్ డిపో వద్ద గురువారం నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథుల గా ఏపీ జెఏసి అమరావతి ఎన్టీఆర్ జిల్లా చైర్మన్ బత్తిన రామకృష్ణ, రాష్ట్ర కోశాధికారి తిమ్మసర్తి నాగేశ్వరరావు, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి యలమంచిలి రవి పాల్గొన్నారు.

# సిఎం రాక నియోజకవర్గ ప్రజల అదృష్టం : ప్రత్తిపాటి

## -శనివారం చిలకలూరిపేట నియోజకవర్గంలో సీఎం చంద్రబాబు పర్యటన

చిలకలూరిపేట, జూన్ 18, ప్రభాతవార్త: కూటమిప్రభుత్వం ఏర్పడ్డాక ముఖ్యమంత్రిహోదాలో ప్రియతమ నాయకులు చంద్రబాబు తొలిసారి నియోజకవర్గానికి విచ్చేయడం నిజంగా ప్రజల అదృష్టంగా భావిస్తున్నామని, ప్రజా నాయకుడి పర్యటనను ప్రజలు విజయవంతం చేయాలని





శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పిలుపునిచ్చారు. గురువారం ఆయన జిల్లా కలెక్టర్ శ్రీమతి కృతికాశుక్లా, నియోజకవర్గ టీడీపీ నాయకులతో కలిసి శనివారం జరిగే ముఖ్యమంత్రి పర్యటనా ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. అనంతరం ప్రత్తిపాటి, కలెక్టర్ కృతికా శుక్లాలు విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి కార్యక్రమాలను విజయవంతం చేస్తాం.. శనివారం చిలకలూరిపేట నియోజకవర్గంలో జరిగే ముఖ్యమంత్రి కార్యక్రమాలను మునుపెన్నడూ లేని విధంగా విజయవంతం చేస్తామని ఎమ్మెల్యే ప్రత్తిపాటి తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి మొదటిసారి నియోజకవర్గానికి రావడం నిజంగా తమ ప్రజల అదృష్టమని ఆయన చెప్పారు. ఎన్నికలకు ముందు మూడుపార్టీలు కూటమిగా ఏర్పడ్డాక, నియోజకవర్గంలో ప్రధాని మోదీ సభ నిర్వహించి, భారీస్థాయిలో విజయవంతం చేశామని ఆయన తెలిపారు. మరలా నేడు ముఖ్యమంత్రి పర్యటనకు నియోజకవర్గం వేదిక కావడం తమకెంతో సంతోషాన్నిచ్చిందని ఆయన చెప్పారు. ఈ ప్రాంత ప్రజలు ముఖ్యమంత్రి ఎప్పుడొస్తారా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్టు ప్రత్తిపాటి తెలిపారు. 20న జరిగే స్వచ్ఛాంధ్రస్వర్ణాంధ్ర కార్యక్రమంతో పాటు. అన్నదాతా సుఖీభవపీఎం కిసాన్ యోజన కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి చిలకలూరిపేటకు వస్తున్నట్టు ప్రత్తిపాటి పేర్కొన్నారు. ఆ రోజున ఉదయం 11 గంటలకు ముఖ్యమంత్రి హెలిప్యాడ్ వద్ద హెలికాప్టర్ దిగిన వెంటనే ప్రకృతి సేద్యాన్ని పరిశీలించి, రైతులతో మాట్లాడతారని, అనంతరం అంగన్ వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి, అక్కడ జరిగే కార్యకలాపాలు పరిశీస్తారని ప్రత్తిపాటి తెలియచేశారు. భోజన విరామానంతరం 1200 మందితో జరిగే టీడీపీ విస్తృతస్థాయి సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొంటారని చెప్పారు. అనంతరం పశ్చిమ బెంగాల్ నుంచి ప్రధాని మోదీ పాల్గొనే పీఎం కిసాన్ యోజన నిధుల విడుదల కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఇక్కడినుంచే లైవ్ లో పాల్గొంటారని, తర్వాత అన్నదాతా సుఖీభవ ప్రజావేదిక నుంచి రైతులు, ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారని ప్రత్తిపాటి చెప్పారు. ముఖ్యమంత్రి కార్యక్రమాలను టీడీపీ మరియు మిత్రపక్షాల శ్రేణులు విజయవంతం చేయాలని ప్రత్తిపాటి కోరారు.

**పర్యటన ఏర్పాట్లు పర్యవేక్షించాం: కలెక్టర్ కృతికాశుక్లా**

20వ తేదీన ముఖ్యమంత్రి చిలకలూరిపేట మండలం లింగంగుంట్ల పంచాయతీకి రానున్న నేపథ్యంలో స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావుతో కలిసి, సీఎం పర్యటన ఏర్పాట్లు పర్యవేక్షించడం జరిగిందని పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఒకేరోజు స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర, అన్నదాతాసుఖీభవ కార్యక్రమాల్లో పాల్గొంటారని ఆమె తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసేలా వారికి మార్గనిర్దేశం చేసినట్టు ఆమె తెలియచేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సంజన సిన్హా, ఆర్డీవో బాలకృష్ణ, డీఎస్పీ హనుమంతరావు, నియోజకవర్గ అబ్జర్వార్ ఆడక స్వాములు, సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మండల అధ్యక్షులు జవ్వాజి మదన్ మోహన్, గ్రామ నాయకులు, వివిధ హోదాలలో ఉన్న అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పల్నాడు జిల్లాలో సీఎం చంద్రబాబు నాయుడు పర్యటన షెడ్యూల్

చిలకలూరిపేట, జూన్ 18, ప్రభాతవార్త: జూన్ 20, 2026 ఉదయం 11:55 గంటలకు ఉండవల్లి నివాసం నుంచి హెలికాప్టర్ ద్వారా బయలుదేరు. మధ్యాహ్నం 12:15 గంటలకు చిలకలూరిపేట మండలం లింగంగుంట్ల హెలిప్యాడ్‌కు చేరిక. 12:15 నుంచి 12:25 వరకు ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకుల స్వాగత కార్యక్రమం. 12:30 గంటలకు లింగంగుంట్ల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి చేరుకుని పరిశీలన. 12:30 నుంచి 12:45 వరకు అంగన్‌వాడీ కేంద్రం సందర్శన. 12:50 గంటలకు రైతులతో ముఖాముఖి కార్యక్రమ వేదికకు చేరిక. 12:50 నుంచి 01:20 వరకు రైతులతో ప్రత్యక్షంగా చర్చలు, సమస్యలపై అవగాహన. 01:25 నుంచి 02:10 వరకు రిజర్వ్ సమయం. 02:15 గంటలకు కేడర్ సమావేశ వేదికకు చేరిక. 02:15 నుంచి 03:45 వరకు టీడీపీ కేడర్ సమావేశంలో పాల్గొనడం. 03:50 గంటలకు ప్రజావేదిక సమావేశ ప్రాంగణానికి చేరిక. 03:50 నుంచి 05:45 వరకు ప్రజావేదిక సమావేశంలో పాల్గొని ప్రసంగం. 05:55 గంటలకు లింగంగుంట్ల హెలిప్యాడ్‌కు చేరిక. 06:00 గంటలకు హెలికాప్టర్ ద్వారా తిరుగు ప్రయాణం. 06:20 గంటలకు ఉండవల్లి నివాసానికి చేరిక. చిలకలూరిపేట మండలం లింగంగుంట్ల గ్రామంలో సీఎం నారా చంద్రబాబు నాయుడు గారు అంగన్‌వాడీ కేంద్రం సందర్శన, రైతులతో ముఖాముఖి, టీడీపీ కేడర్ సమావేశం, ప్రజావేదిక సభ వంటి పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. జిల్లా యంత్రాంగం, పోలీసులు భద్రతా ఏర్పాట్లు ముమ్మరం చేశారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను సమగ్రంగా చేపట్టాలి : టీడీపీ అధికార ప్రతినిధి మురుకొండ మల్లిబాబు

చిలకలూరిపేట, జూన్ 18, ప్రభాతవార్త: రాష్ట్ర వ్యాప్తంగా భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం,పట్టణంలోని 8వ వార్డు పరిధిలో బిఎల్వోలు,



బిఎల్ ఎ,లతో కలిసి టీడీపీ అధికార ప్రతినిధి మురుకొండ మల్లిబాబు ఇంటింటి సర్వేలో పాల్గొన్నారు. వార్డు పరిధిలో నిర్వహించిన ఇంటింటికి సర్వే కార్యక్రమంలో పాల్గొన్న మల్లిబాబు ప్రజల వివరాలు సేకరణ వాటర్ జాబితా పరిశీలన చేసి రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గ దర్శకాలను వారికి వివరించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మల్లిబాబు మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియపై ఆందోళనల నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహించే బి ఎల్ వో లు ఓటర్ల అనుమానాలు నివృత్తి చేసే విధంగా కృషి చేయాలని, తద్వారా ఎస్ఐఆర్ ప్రక్రియను సమగ్రంగా పూర్తి చేసేందుకు ఓటర్లు స్వచ్ఛందంగా సహకరించేందుకు మార్గం సుగమోతుందని పేర్కొన్నారు

## చిలకలూరిపేటలో అత్యాధునిక ప్రత్తిపాటి ఆటో నగర్‌కు భూమిపూజ

చిలకలూరిపేట, జూన్ 18, ప్రభాతవార్త: చిలకలూరిపేట, జూన్ 18: చిలకలూరిపేట నియోజకవర్గంలో ఆటోమొబైల్ రంగానికి కొత్త కళను తీసుకువచ్చేందుకు ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ప్రత్తిపాటి ఆటో నగర్ నిర్మాణ పనులకు భూమిపూజ జరిగింది. పోతావరం పరిధిలో చేపట్టిన ఈ ప్రాజెక్టుకు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టి.జి. భరత్ ముఖ్య అతిథిగా హాజరై, స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుతో కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరించి, భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి టి.జి. భరత్ మాట్లాడుతూ, చిలకలూరిపేట పారిశ్రామికంగా ఎదగడానికి ఈ ఆటో నగర్ ఎంతగానో దోహదపడుతుందని



పేర్కొన్నారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు కృషితో 53 ఎకరాల విస్తీర్ణంలో 615 షాపులతో ఈ నగరాన్ని తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ఇది పూర్తయితే స్థానికంగా ఆటోమొబైల్ రంగానికి ఒకే వేదిక లభించడమే కాకుండా, వందలాది మంది నిరుద్యోగ యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం, ప్రాజెక్టులో షాపులు కేటాయించేందుకు ఎంపికైన అర్హులైన లబ్ధిదారులకు మంత్రి మరియు ఎమ్మెల్యేలు అలాట్‌మెంట్ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, లబ్ధిదారులు మరియు ప్రజలు పాల్గొన్నారు.

## 18వ వార్డులో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం



చిలకలూరిపేట, జూన్ 18, ప్రభాతవార్త: ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణలో భాగంగా 18వ వార్డు పరిధి 183 పోలింగ్ బూత్ పరిధిలో బి.ఎల్.ఓ తో కలసి వెరిఫికేషన్ ఫారంలను పంపిణీ చేశారు..ఈ కార్యక్రమంలో 18వ వార్డు పార్టీ అధ్యక్షులు ఆరెకట్ల కోటేశ్వరరావు,183వ బూత్ కన్వీనర్ కొండా శ్రీను, బాజీ భాష అజీజ్ పాల్గొన్నారు

## చిలకలూరిపేటలో దంచికొట్టిన వాన.. రైతన్నల్లో ఆనందం..

చిలకలూరిపేట, జూన్ 18, ప్రభాతవార్త: చిలకలూరిపేట ప్రాంతంలో ఈ సీజన్లోనే అత్యంత భారీ వర్షం నమోదైంది. గురువారం సాయంత్రం ఏడు గంటల సమయం నుంచి ప్రారంభమైన వర్షం, ఎడతెరిపి లేకుండా కురుస్తూ పట్టణాన్ని, పరిసర ప్రాంతాలను ముంచెత్తింది. గడిచిన కొద్ది రోజులుగా ఉక్కపోతతో సతమతమైన ప్రజలకు ఈ వర్షం ఉపశమనాన్ని ఇచ్చింది. రైతుల్లో ఆనందం ఈ భారీ వర్షం వ్యవసాయ పనులకు ఊపిరి పోసింది. వానల కోసం ఆశగా ఎదురుచూస్తున్న రైతులకు ఈ వర్షం ఎంతో మేలు చేసింది. భూమి తడవడంతో పంట సాగుకు అనువైన వాతావరణం ఏర్పడిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే సాగుకు సిద్ధమైన రైతులు, విత్తనాలు నాటుకోవడానికి పనులను ముమ్మరం చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. జనజీవనంపై ప్రభావం భారీ వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. సాయంత్రం వేళ కావడంతో ఆఫీసుల నుంచి ఇళ్లకు వెళ్లేవారు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రధాన రహదారులపై నీరు నిలవడంతో వాహన రాకపోకలకు కొంత అంతరాయం కలిగింది. వర్షం తీవ్రత దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక అధికారులు సూచిస్తున్నారు

# పల్నాడు జిల్లా వార్త



## జిల్లాలో 4.24 లక్షల ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ

### కలెక్టర్ కృతికా శుక్లా



నరసరావుపేట, జూన్ 18 ప్రభాతవార్త : ఈ నెల 14 నుంచి జిల్లా వ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, వేగంగా సాగుతోందని జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా తెలిపారు. జిల్లాలోని మొత్తం 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇప్పటివరకు 4,25,832 ఎన్యూమరేషన్ ఫారాలను ఓటర్లకు పంపిణీ చేశామన్నారు. క్షేత్రస్థాయి నుండి సేకరించిన ఫారాల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ నిరంతరం కొనసాగుతోందని, ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 11,675 ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పూర్తయిందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 17,41,798 మంది ఓటర్లు ఉన్నారని, వారి వివరాల సేకరణ మరియు సవరణ కోసం క్షేత్రస్థాయిలో బి.ఎల్.ఓ ల ద్వారా ముమ్మరంగా సర్వే నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

## మరణంలేని స్వాతంత్ర్య సమర యోధుడు నేతాజీ

నరసరావుపేట టౌన్, జూన్ 18 ప్రభాతవార్త : పల్నాడు జిల్లా నరసరావుపేట విద్యార్థుల్లో స్వాతంత్ర ఉద్యమ స్ఫూర్తిని నింపేందుకు నరసరావుపేట రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాల మరియు మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ పోరాటం గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చిలకలూరిపేట సి.ఆర్. కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ రోటీరియన్ తోటకూర వెంకట నారాయణ, నరసరావుపేట రోటరీ క్లబ్ అధ్యక్షులు షేక్. కరీం మొహిద్దిన్ హాజరై మాట్లాడారు. దేశ స్వాతంత్రం కోసం పోరాడిన మహనీయులను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరికీ చావు, పుట్టుక సహజమని, ఐతే ప్రపంచంలో పుట్టుకేగానీ, మరణంలేని స్వాతంత్ర్య సమర యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని కొనియాడారు. స్వాతంత్ర్య సమర యోధుల త్యాగాలు, పోరాటాలు, విద్యార్థులకు క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ డైరెక్టర్స్ ఎస్.కె. జిలాని మాలిక్, డి వి ఎస్ ఎన్ పున్నారావు, మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎస్. శ్రీరాములు రెడ్డి, మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం. షేక్. మోలాబి, ఉపాధ్యాయులు షేక్. అబ్దుల్ సలీం, ఉషారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.



## బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

నరసరావుపేట టౌన్, జూన్ 18 ప్రభాతవార్త : ఫిరంగిపురం మండలం జోసెల్ కంపెనీ సమీపంలోని మల్కా చెరువు వద్ద చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదంలో నకరికల్లు మండలం



దేచవరం గ్రామానికి చెందిన దంపతులు గుమ్మడిదల కోటేశ్వరరావు, పద్మ మృతి చెందారు. వారి భౌతికకాయాలను నరసరావుపేటలోని ఏరియా వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు గురువారం ఏరియా వైద్యశాలకు వెళ్లి, మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం తరపున మృతుల కుటుంబాలకు అందాల్సిన సహాయాన్ని త్వరితగతిన అందేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు హామీ ఇచ్చారు.

## పమిడిపాడులో మహా కుంభాభిషేక మహోత్సవాలు

నరసరావుపేట, జూన్ 18 ప్రభాతవార్త : మండలం లోని పమిడిపాడు గ్రామంలో వేయి సంవత్సరాల క్రితం చోళ రాజులచే నిర్మించబడిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వల్లభరాజ స్వామి వారి దేవస్థానంలో విమాన శిఖర జీవధ్వజ ప్రతిష్టా పురస్సర మహా కుంభాభిషేక మహోత్సవం ఈ నెల 21 నుండి 24వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. వైఖానస ఆగమోక్తంగా ఆలయ ప్రధాన అర్చకులు,వైఖానస ఆగమ పండితులు శ్రీమాన్ రొంపిచర్ల ఆంజనేయులు ఆధ్వర్యంలో ఈ మహా కుంభాభిషేక మహోత్సవాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా ఈనెల 21వ తేదీన శ్రీ రామకోటి మహోత్సవంతో పాటు విశేషాలు జరుగుతాయని తెలిపారు. శ్రీరామ కోటి పుస్తకాలు రాసిన భక్తులు ఈనెల 21వ తేదీ లోపు ఆ పుస్తకాలను దేవాలయాల్లో అందజేయాల్సిందిగా కోరారు. 22వ తేదీన ఉదయం విశ్వక్సేనారాధనతో కార్యక్రమాలు ప్రారంభమై అధివాసాంగ ప్రధాన హోమంతో కార్యక్రమం ఆ రోజుకు పూర్తి అవుతుందని తెలిపారు. 23వ తేదీన నవగ్రహారాధన నవగ్రహ హోమం శ్రీరామ మాల మంత్ర హోమం తదిత కార్యక్రమాలు తోపాటు చతుర్భుజి కుంభారాధన సుదర్శన హోమం నిర్వహించనున్నట్లు వివరించారు. గురువారం సాయంత్రం వివిధ హోమాలతో పాటు మహా శాంతి హోమం కూడా నిర్వహిస్తారని తెలిపారు చివరి రోజు అయిన 24వ తేదీ ఉదయం నుండి వివిధ కార్యక్రమాలను చేపట్టి, కుంభారాధన ,మహా పూర్ణాహుతి ,కుంభ సమారోపణం, రత్నం న్యాస, ధాతున్యాస, బీజ, యంత్రస్థాపన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉదయం ఎనిమిది గంటల 21 నిమిషాలకు జీవధ్వజ ప్రతిష్ట మహాకుంభాభిషేకం ఘనంగా భక్తుల సమక్షంలో జరుగుతుందని వివరించారు. 10:30 గంటలకు శ్రీవారి కళ్యాణ మహోత్సవం జరుగుతుందని మధ్యాహ్నం భక్తులకు మహా అన్నసంతర్పణ జరుగుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమాలన్నింటికీ భక్తులు విశేష సంఖ్యలో హాజరై జయప్రదం చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.



## ఎమ్మెల్యే డా.చదలవాడను కలిసిన జంగా కృష్ణమూర్తి

నరసరావుపేట, జూలై 18 ప్రభాతవార్త : నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు ని గురువారం ఎమ్మెల్యే జంగా కృష్ణమూర్తి మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఫౌండర్ అండ్ చైర్మన్ పల్నాడు శ్రీ మహాసేవ క్షేత్రం ట్రస్ట్ ట్రస్టీ తిరుమల తిరుపతి దేవస్థానం జంగా కృష్ణమూర్తి తో పాటు బీసీ సంఘీలతో కలవడం సంతోషంగా ఉందన్నారు. దాచేపల్లి మండలంలోని గామాలపాడు గ్రామంలో నాగమ్మ ప్రాంగణంలో నిర్మించనున్న పల్నాడు శ్రీ మహాసైవ క్షేత్రం దేవాలయ శంకుస్థాపన కార్యక్రమానికి హాజరుకావాలని కోరడం జరిగిందన్నారు. అదేవిధంగా ఆలయ అభివృద్ధి పనుల అంకురార్పణ కార్యక్రమానికి హాజరుకావలసిందిగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు కి ఆహ్వాన పత్రికను జంగా కృష్ణమూర్తి అందజేసి గౌరవపూర్వకంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పలువురు పాల్గొన్నారు.



## టిడిపి వెబ్ సైట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

నరసరావుపేట టౌన్,జూన్ 18 ప్రభాతవార్త : నరసరావుపేట తెలుగుదేశం పార్టీ వెబ్ సైట్ ను స్థానిక కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు ప్రారంభించారు. నియోజకవర్గ ప్రజానీకానికి మరియు నాయకులకి,కార్యకర్తలకు అనుసంధానంగా. ఎన్నార్టీ టీడీపీ డాట్ కాం. అనే వెబ్ సైట్ ని లాంచ్ చేశామని శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ, టీటీడీ దేవస్థానం బోర్డు మెంబర్ జంగా కృష్ణమూర్తి కార్యక్రమంలో పాల్గొన్నారు . నాయకులకి,కార్యకర్తలకి అనుసంధానంగా ఈ యొక్క వెబ్సైట్ పనిచేస్తుందని శాసనసభ్యులు తెలియజేశారు. ఈ లాంచింగ్ కార్యక్రమంలో పాల్గొన్న జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ వెబ్సైట్ టెక్నాలజీ చాలా బాగుందని అందరికీ ఉపయోగపడేదన్నా రు.కొత్త ఆలోచనలతో ఇన్నోవేషన్ తో ముందుకు వస్తున్నటువంటి యువతకి ఇది ఒక మంచి పరిణామం అన్నారు.ఎన్నార్టీ టీడీపీ డాట్ కామ్ వెబ్సైట్ చాలా బాగుంది అని ఎమ్మెల్యే తెలిపారు.వెబ్ సైట్ డిజైన్ చేసినటువంటి స్టూడెంట్స్ ని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మరియు టిటిడి బోర్డు మెంబర్ జంగా కృష్ణమూర్తి లు అభినందించారు.



## 'కూటమి' పాలనలో సంక్షేమం, అభివృద్ధి: ఎమ్మెల్యే 'కన్నా'



సత్తెనపల్లి. జూన్ 18, ప్రభాతవార్త: వినుకొండ పట్టణం గంగినేనిఫంక్షన్ హాల్‌లో రెండేళ్ల నమ్మకం.. విజయోత్సవ సభలో పార్లమెంట్ సభ్యులు మరియు సహచర శాసన సభ్యులతో కలిసి తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు, సత్తెనపల్లి శాసన సభ్యులు కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, సిఎం చంద్రబాబు పై తప్పుడు కేసులు పెట్టి జగన్ జైలుకు పంపారన్నారు. అంతేకాకుండా గత వైకాపా పాలనలో ఉపాధ్యాయులను బ్రాందీ షాపు దగ్గర నిలబెట్టారన్నారు. వైసీపీ హయాంలో రాక్షస పాలన సాగిందని కన్నా పేర్కొన్నారు. అంతేకాకుండా ల్యాండ్ టైటిల్ యాక్ట్ పేరు తో భూములు కాజేసే ప్రయత్నం చేశారని, గతంలో అనేక రాజకీయ హత్య లు జరిగాయన్నారు. ప్రస్తుతం కూటమి పాలన లో సంక్షేమం ,అభివృద్ధి జరుగుతున్నాయని పేర్కొన్నారు.

## సత్తెనపల్లి నియోజకవర్గంలో వేగంగా ఓటర్ల ఎన్యూమరేషన్ ప్రక్రియ

సత్తెనపల్లి. జూన్ 18, ప్రభాతవార్త: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 98సత్తెనపల్లి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ మ్యాపింగ్ మరియు ఎన్యూమరేషన్ కార్యక్రమం కొనసాగుతోంది. నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి, రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం విడుదల చేసిన వివరాల ప్రకారం, జూన్ 18 నాటికి నియోజకవర్గంలో మొత్తం 2,43,048 మంది ఓటర్లు నమోదై ఉన్నారు. ఇందులో భాగంగా ఇప్పటివరకు 45,327 మంది ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేయగా, 2,961 మంది ఓటర్ల వివరాలను డిజిటలైజేషన్ చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఓటర్ల జాబితాను మరింత పారదర్శకంగా, ఖచ్చితత్వంతో రూపొందించేందుకు ఈ ప్రక్రియ కొనసాగుతున్నదని తెలిపారు.

## మరణించిన స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సాయం

సత్తెనపల్లి, జూన్ 18, ప్రభాతవార్త: 30 ఏళ్ల క్రితం పదవ తరగతి మిత్రుని కోసం వాట్సప్ వేదికగా ఒకటైన స్నేహబంధం సత్తెనపల్లి బాల్యం..స్నేహం.. విడదీయరాని.. బంధం. ఇది శాశ్వతం. .ఎప్పుడో 30 ఏళ్ల క్రితం పదవ తరగతి వరకు జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుకున్న మిత్రుని అకాల మరణం స్నేహితులకు తెలిసి అందరు బాధపడ్డారు. కొందరు ఆవేదన చెందుతూ కూర్చోలేదు.. ఆ



కుటుంబం అనుభవిస్తున్న పేదరికాన్ని గుర్తించి వాట్సాప్ వేదికగా తమ ఆలోచనలను పంచుకున్నారు. ఆర్థిక సహాయానికి ముందడుగు వేశారు. ఒక్క సందేశం మిత్రుల హృదయాలను కదిలించింది. భృగుబండ గ్రామము లోని 1997.98 పదవతరగతి జిల్లా పరిషత్ స్కూల్ బ్యాచ్ కు సంబందించిన వేల్పూరి మహా జగన్నాధం అకాల మరణం తో ఆ కుటుంబానికి ఆసరాగా నిలిచేందుకు మిత్రుల సహకారంతో రూ. 1,02,500 లను గురువారం అందించారు. ఇందుకు సహకరించిన దొరెడ్ల హరి బాబు, బిట్రగుంట కృష్ణారావు,బొజ్జ నరేష్,గంగదాసు శ్రీధర్ రెడ్డి ,అద్దేపల్లి రామారావు ,పల్లప్రోలు రామి రెడ్డి,బిట్రగుంట ఆంజనేయులు,గంపల అంకమ్మరావు మిత్ర బృందాన్ని గ్రామ పెద్దలు అభినందిస్తున్నారు.

## ఏలూరులో న్యాయవాదిపై దాడికి సత్తెనపల్లి బార్‌అసోసియేషన్ ఖండన

సత్తెనపల్లి, జూన్ 18, ప్రభాతవార్త: సత్తెనపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగూరి అజయ్ కుమార్ ఆధ్వర్యంలో, గురువారం న్యాయవాదులు నాలుగు న్యాయస్థానాల్లో విధులను గుంటూరు జిల్లా బార్ ఫెడరేషన్ పిలుపులో భాగంగా బహిష్కరించి తాలూకా న్యాయస్థాన ప్రాంగణంలో



న్యాయదేవత విగ్రహం వద్ద న్యాయవాదులు తీవ్ర నినాదాలు చేశారు. ఇటీవల దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ ఏలూరు లో సీనియర్ న్యాయవాది మరియు తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర నాయకులు ఇడుపుగంటి శ్రీనివాస బాబు ను ఆయన ఇంటి వద్దకే వెళ్ళి తీవ్ర పదజాలంతో దూషణలు చేయటమే కాక బెదిరింపులకు పాల్పడటానన్ని తీవ్రంగా ఖండించటమే కాక ఆయన పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గంగూరి అజయ్ కుమార్ తోపాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

## మండల పరిధిలో గుంటూరు- బీబీనగర్ రైల్వేలైను డబ్లింగ్ నిర్మాణానికి భూసేకరణ

సత్తెనపల్లి, జూన్ 18, ప్రభాతవార్త: స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో గురువారం గుంటూరు –బీబీనగర్ మధ్య రైల్వే డబ్లింగ్ లైను నిర్మాణానికి గానూ భూసేకరణలో భాగంగా సత్తెనపల్లి మండల పరిధిలోని రైతులతో అవార్డు ఎంక్వయిరీ సమావేశం జరిపారు. కంపిటెంట్ అథారిటీ(భూసేకరణ)



రెవెన్యూ డివిజనల్ అధికారి, సత్తెనపల్లి అధ్యక్షతన జరిగింది. భూసేకరణలో భాగమైన అబ్బూరు, గుడిపూడి, భీమవరం, కంకణాలపల్లి, సత్తెనపల్లి మరియు ధూళిపాళ్ళ గ్రామాల పరిధిలోని నోటిఫైడ్ రైతులు అందరూ ఈ సమావేశము నందు పాల్గొని తమ భూమికి సంబంధించిన హక్కు పత్రాలను సమర్పించారు. భూసేకరణ అధికారులు ఈ ఎంక్వయిరీ కి హాజరైన రైతులందరికీ పరిహారమునకు గురించిన పూర్తి సమాచారాన్ని అందజేశారు. సత్తెనపల్లి మండల పరిధిలోని గుంటూరు –బీబీనగర్ మధ్య రైల్వే డబ్లింగ్ లైను నిర్మాణానికి గానూ భూసేకరణలో భాగమైన వివిధ గ్రామాలలోని భూ విస్తీర్ణం వివరాలు వెల్లడించారు. అబ్బూరు:ఎ . 0.375 సెంట్లు, గుడిపూడి: ఎ. 0.610 సెంట్లు, ఛేమవరం:ఎ 0.871 సెంట్లు, కంకణాలపల్లి:ఎ. 5.595 సెంట్లు సత్తెనపల్లి :ఎ.7.310 సెంట్లు, ధూళిపాళ్ళ:ఎ. 11.960 సెంట్లు. పై గ్రామాలకు చెందిన మొత్తం 193 మంది రైతులు ఈ సమావేశమునకు హాజరైయున్నారని తెలిపారు.

## ఉమ్మడి గుంటూరు జిల్లాలో గత జాతీయ లోక్‌అదాలత్‌లో అత్యధికంగా కేసులు సత్తెనపల్లి న్యాయస్థానాల పరిధిలో పరిష్కారం

సత్తెనపల్లి జూన్ 18, ప్రభాతవార్త: గత జాతీయ లోక్ అదాలత్ లో ఉమ్మడి గుంటూరు జిల్లాలోనే అత్యధికంగా కేసులు సత్తెనపల్లి న్యాయస్థానాల పరిధిలో పరిష్కారం చేసిన సందర్భంగా సత్తెనపల్లి బార్ అసోసియేషన్ ను మరియు స్థానిక న్యాయ మూర్తులను అభినందించిన గుంటూరు జిల్లా న్యాయ మూర్తులు. ఇదే స్ఫూర్తితో వచ్చే నెలలో జరిగే జాతీయ లోక్ అదాలత్ లో కూడా జిల్లాలోనే సత్తెనపల్లి ప్రథమ స్థానంలో నిలవాలని న్యాయమూర్తులు కేక్ కట్ చేశారు. రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తి నాగరాజు, మూడవ అదనపు జిల్లా న్యాయమూర్తి నాగ శ్రీనివాసరావు మరియు నాల్గవ జిల్లా న్యాయమూర్తి శ్రీనివాసరావు. సత్తెనపల్లి లో గురువారం సాయంత్రం సీనియర్ సివిల్ జడ్జి



కోర్ట్ హాల్లో వచ్చే నెల 11వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్ లో అత్యధిక సంఖ్యలో కేసులు పరిష్కరించాలి అని దానికి సత్తెనపల్లి బార్ అసోసియేషన్ సహకారం కావాలి అని సమావేశం నిర్వహించడం జరిగింది. ఇప్పటి వరకు జరిగిన జాతీయ లోక్ అదాలత్ లో ఉమ్మడి గుంటూరు జిల్లాలోనే సివిల్ కేసుల్లో సత్తెనపల్లి నాలుగు సార్లు ప్రథమ స్థానం మరొకసారి రెండవ స్థానం లో నిలిచింది. ఈ కార్యక్రమంలో రెండవ జిల్లా న్యాయమూర్తి నాగరాజు, మూడవ జిల్లా న్యాయమూర్తి నాగ శ్రీనివాసరావు, నాల్గవ జిల్లా న్యాయమూర్తి శ్రీనివాసరావు, గుంటూరు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి మరియు సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్ ) జియావు ద్దీన్, సత్తెనపల్లి మండల న్యాయసేవధికార సంస్థ చైర్మన్ మరియు సత్తెనపల్లి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్ ) వి. విజయ్ కుమార్ రెడ్డి, సత్తెనపల్లి న్యాయమూర్తులు ఖౌషిద్ హుస్సేన్, పి. ప్రియదర్శిని మరియు జె. సుజిన్ కుమార్ మరియు సత్తెనపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షులు గంగూరి అజయ్ కుమార్ తోపాటు న్యాయవాదులు పాల్గొన్నారు.

## ఆర్డిఓ కార్యాలయం ఎదుట ఏఐఎస్ఎఫ్ నిరసన

నరసరావుపేట, జూన్ 18 ప్రభాతవార్త : ప్రభుత్వ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ హాస్టల్స్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) నరసరావుపేట సమితి ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం తెలిపి, ఆర్డిఓ బాలకృష్ణకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ బీసీ, ఎస్సీ, ఎస్టీ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు రూ. 2500 3000 లకు పెంచాలన్నారు. 1 నుంచి 10వ తరగతి వరకు చదువుకున్న విద్యార్థులకు నెలకు రూ. 1200, ఇంటర్మీడియట్ విద్యార్థులకు రూ. 1600 బడ్జెట్ కేటాయిస్తే 30 రోజుల్లో ఉదయం నుంచి రాత్రి వరకు పెట్టడానికి ఏమాత్రం సరిపోవడం లేదని పేర్కొన్నారు. జైల్లో ఉన్న ఖైదీలకు రాష్ట్ర బడ్జెట్లో రోజుకు నూరు రూపాయలకు పైగా కేటాయిస్తున్నారని, కానీ ప్రభుత్వ హాస్టల్లో చదువుతున్న విద్యార్థులకు రోజుకు రూ. 53 కేటాయించడం బాధాకరమన్నారు. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ బీసీ ఎస్సీ ఎస్టీ హాస్టల్స్ లో ఖాళీగా ఉన్న వార్డెన్, కుక్, అటెండర్, కామాటి, ట్యూటర్ పోస్టులు భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మేకపోతుల నాగేశ్వరావు, హేమంత్, యశ్వంత్, మధు, హర్ష, చరణ్. తదితరులు పాల్గొన్నారు.

## గోవాడను పరామర్శించిన టిడిపి సమన్వయకర్త నందం అబద్దయ్య

మంగళగిరి, జూన్ 18, ప్రభాతవార్త: మంగళగిరి ఆంజనేయ కాలనీలో ఇటీవల మెట్లు ఎక్కుతూ ప్రమాదవశాత్తు జారిపడి ఎడమ కాలు ఎముక విరిగి చికిత్స పొంది తన నివాసంలో విశ్రాంతి



తీసుకుంటున్న తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గోవాడ దుర్గారావును బుధవారం రాత్రి రాష్ట్ర పద్మశాలియ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు కలిసి పరామర్శించారు. అనంతరం నందం మాట్లాడుతూ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని గోవాడ త్వరగా కోలుకొని పార్టీ కార్యక్రమాల్లో యధావిధిగా పాల్గొనాలని ఆకాంక్షించారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు గుత్తికొండ ధనంజయరావు, ఏపీఎస్పీ ఏఎస్ఐ బుర్రా శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ దిడ్ల సత్యానందం, టీడీపీ నాయకులు అలుగూరి వీరాంజనేయులు, తుమ్మా వెంకటేశ్వరరావు, 28వ వార్డు టీడీపీ నాయకులు తురక వీర శేఖర్, కోలా శ్రీనివాసరావు, తోట కరుణ కుమార్, కురగంటి చంటి, షేక్ రజీయా బేగం తదితరులు గోవాడను పరామర్శించిన వారిలో ఉన్నారు.

## గుండిమెడ గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరం

తాడేపల్లి, జూన్ 18, ప్రభాతవార్త: పశువులు ఆరోగ్యంగా ఉంటేనే పాడి రైతు ఆర్థికంగా నిలదొక్కుకుంటాడని, రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మంగళగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ అన్నారు.. గురువారం తాడేపల్లి మండలం గుండిమెడ గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రారంభించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో, ఆంధ్రప్రదేశ్ పశుసంవర్ధక శాఖ సహకారంతో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిబిరంలో పశువులకు ఉచిత ఆరోగ్య పరీక్షలు, మందుల పంపిణీ, టీకాలు, గర్భకోశ వ్యాధుల నివారణ చికిత్సలు అందించనున్నట్లు చెప్పారు. అలాగే పశువుల



పోషకాహారం, సంరక్షణపై రైతులకు అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు.. శిబిరంలో నిపుణులైన పశువైద్యులు పశువులకు ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు, టీకాలు అందజేసినట్లు తెలిపారు. గర్భకోశ వ్యాధులు, నట్టల నివారణతో పాటు పశువుల పోషకాహారం, గురించి రైతులకు వివరించినట్లు ఆయన చెప్పారు .. గుండి మెడ గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల పాడి రైతులు, పశుపోషకులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకున్నారని జవ్వాది కిరణ్ చంద్ తెలిపారు... ఈ కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షులు కొమ్మారెడ్డి కిరణ్, మార్కెట్ యార్డ్ సెక్రటరీ పి.ప్రభారాణి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ వీరిశెట్టి శ్రీనివాసరావు, గ్రామ పార్టీ అధ్యక్షులు సుబ్బారావు, అనుమోలు ఆంజనేయులు , శంకర్, డాక్టర్ వెంకట సురేష్, గుణ దీర్, గ్రామ రైతులు, వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు

## బీసీవై పార్టీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా రామచంద్ర యాదవ్ జన్మదిన వేడుకలు

మంగళగిరి, జూన్ 18, ప్రభాతవార్త : భారత చైతన్య యువజన పార్టీ జాతీయ అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్ పుట్టినరోజు సందర్భంగా ఈ రోజు మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మెగా రక్తదాన శిబిరం, ఉచిత వైద్య శిబిరం, కేక్ కటింగ్, అన్నదాన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీవై పార్టీ యువ నాయకుడు సాయి గోపి ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం విజయవంతంగా నిర్వహించబడింది. పెద్ద సంఖ్యలో యువత, పార్టీ కార్యకర్తలు రక్తదానం చేసి తమ సేవాభావాన్ని చాటుకున్నారు. అలాగే ఉచిత వైద్య శిబిరంలో ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ బీసీవై పార్టీ నిర్మాణ కోఆర్డినేటర్ శ్రీ అంగిరేకుల ఆదిశేషు, ఏపీ పీఏసీ సభ్యురాలు ఆకుల జయ కళ్యాణి, మంగళగిరి అసెంబ్లీ కన్వీనర్ శ్రీ తోట శివరామకృష్ణ, ప్రత్తిపాడు అసెంబ్లీ కన్వీనర్ శ్రీ యెర్రాకుల భాస్కర్ రావు, రాష్ట్ర మహిళా కోకన్వీనర్ శ్రీమతి కాగితాల స్వాతి గౌడ్, మంగళగిరి యువజన కోకన్వీనర్ శ్రీ అడిన సతీష్ బాబు, ఏపీ ఎస్ఈసీ సభ్యులు శ్రీ అరిగెల శ్రీనివాసులు, గుంటూరు జిల్లా యువజన కోకన్వీనర్ శ్రీ బత్తుల నాగరాజు, ఏపీ ఎస్ఈసీ సభ్యులు శ్రీ కూచిపూడి వాసుదేవరావు, ఏపీ పీఏసీ సభ్యులు శ్రీ కందికట్టు నరసింహారావు, ఏపీ రైతు విభాగం కన్వీనర్ శ్రీ అనగాని రాంప్రసాద్ తదితర నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రామచంద్ర యాదవ్ ప్రజా సంక్షేమం, సామాజిక సేవ లక్ష్యంగా పార్టీని ముందుకు నడిపిస్తున్నారని కొనియాడారు. వారి పుట్టిన రోజు పురస్కరించుకుని నిర్వహించిన సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అంతర్జాతీయ బీసీ సంఘం అధ్యక్షులు డా శ్రీ ఎన్.వి. రావు, సంచార జాతుల రాష్ట్ర అధ్యక్షులు శ్రీ గోరంట్ల శ్రీనివాసరావు, బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ నమ్మి అప్పారావు, జీజీహెచ్ బ్లడ్ బ్యాంక్ నుండి డా శ్రీమతి జాస్మిన్, బ్లడ్ బ్యాంక్ వైద్యులు డా శ్రీ వి. శ్రవణ్ కుమార్, వైద్య శిబిరం (మెడికల్ క్యాంప్) వైద్యురాలు డా శ్రీ లలిత అతిథులుగా హాజరయ్యారు. విజయవాడ జీజీహెచ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీమతి రంజిత గారి సహకారంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించడం జరిగింది.

## అన్నపూర్ణాలయంకు 25 వేలు విరాళం

పెదనందిపాడు జూన్ 18 (ప్రభాతవార్త) పెదనందిపాడు షిరిడిసాయి అన్నపూర్ణాలయంలో క్రమం తప్పకుండా ప్రతి గురువారం నిర్వహిస్తున్న అన్నదానం కోసం పెదనందిపాడు కు చెందిన పర్వతనేని



సుబ్బారావు వెంకాయమ్మ దంపతులు. పర్వతనేని అంకమ్మ చౌదరి సత్యవతి దంపతులు గుర్తింపుగా గురువారం షిరిడి సాయి మందిర్ కమిటీ చైర్మన్ శ్రీరామ్ రామ్మోహన్రావు. అరవపల్లి కృష్ణ. అరవపల్లి రామ సుబ్బారావు. తడవర్తి సురేష్ బాబులకు 25 వేల రూపాయలు నగదు అందజేశారు. ఈ సందర్భంగా సాయి మందిర్ నిర్వహణ కమిటీ చైర్మన్ శ్రీ రామ్ మోహన్ రావు దాతను పట్టు శాలువా శిరిడి సాయి ప్రతిమలతో ఘనంగా సత్కరించారు. సాయి మందిర అర్చకులు గౌతం పాండే. సిరి రామ్ పాండేలు దాతల చే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సకలా వీరేంద్ర గుప్తా. దాసరి శివ . సుబ్బారావు. అర్జునరావు. దాసరి కృష్ణ. తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులను అంగన్వాడి కేంద్రాలలో చేర్పించండి..

ప్రత్తిపాడు, జూన్ 18, ప్రభాతవార్త: చిన్నారులను తప్పనిసరిగా అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసిడిఎస్ సూపర్వైజర్లు చిన్నమ్మాయి, మాధవి తల్లులకు సూచించారు. మండలంలోని అనంతవరప్పాడు, లేమల్లెపాడు గ్రామాలలో గురువారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అంగన్వాడీ పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ సూపర్వైజర్లు మాట్లాడుతూ..మూడు సంవత్సరాలు నిండిన పిల్లలకు అంగన్వాడీ కేంద్రాలలో చేర్పించాలన్నారు. అలాగే ఐదేళ్ల పైబడిన విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటవ తరగతిలో చేర్పించాలని తెలియజేశారు. అంగనవాడి కేంద్రాలను బలోపేతం చేయడానికి తల్లిదండ్రులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు పౌష్టికాహారంతో పాటు నాణ్యమైన విద్యా బోధనను అందిస్తారని వివరించారు. గర్భిణీలకు, బాలింతలకు, చిన్నారులకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను గురించి



వివరించారు. అర్హులైన వారు అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందే సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మూడు సంవత్సరాల పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు పంపించడం వలన ఆటపాటలతో పాటు పిల్లలకు మంచిఅలవాట్లు , ప్రాథమికవిద్య నేర్పి వారి శారీరక, మానసిక ఎదుగుదలకు పునాది వేయడం జరుగుతుంది. గుడ్డు, పాలు, పోషకాహారం అందించడం ద్వారా పోషకాహార లోపాన్ని నివారించవచ్చాన్నారు. సురక్షితమైన ప్రేమపూర్వక వాతావరణంలో పిల్లల సమగ్ర అభివృద్ధి జరుగుతుందని, పిల్లలను తప్పనిసరిగా అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని తల్లులకు తెలియజేశారు. మండల పరిధిలో ఉన్న 46 అంగన్వాడీ కేంద్రాలలో ఇప్పటివరకు 82 మంది చిన్నారులను చేర్పించడం జరిగిందన్నారు. వీరందరికీ అక్షరాభ్యాసాలు నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఐసిడియస్ సూపర్ వైజర్లు కె. చిన్నమ్మాయి, పి.మాధవి, ఉపాధ్యాయిని సుప్రియ , ఎంఎల్ హెచ్పి రాధిక, అంగన్వాడీ టీచర్లు వి.కృష్ణకుమారి, పద్మజ, తల్లులు, చిన్నారులు, తదితరులు పాల్గొన్నారు.

## కృత్రిమ మేధస్సుతో సమస్యల పరిష్కారం చూపాలి

ప్రత్తిపాడు, జూన్ 18, ప్రభాతవార్త: కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లకు స్థిరమైన పరిష్కారాలను కనుగొనాల్సిన అవసరం ఉందని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ రెక్టార్ డా.ఆర్.శివరాం ప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని వింజనంపాడు గ్రామ పరిధిలో ఉన్న కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం థాయిలాండ్, షినావత్రా యూనివర్సిటీ సహకారంతో మరియు తమిళనాడు ప్రొఫెసర్స్ అసోసియేషన్ భాగస్వామ్యంతో నిర్వహిస్తున్న గ్లోబల్



ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ గ్లోబల్ ఛాలెంజెస్ అండ్ ఏఐ డ్రివెన్ సొల్యూషన్స్ ఫర్ సస్టైనబుల్ డెవలప్మెంట్ 2026 సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏఎన్యూ రెక్టర్ డా.ఆర్.శివరామ్ ప్రసాద్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కృత్రిమ మేధస్సుతో ఆధారిత సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ప్రపంచం సమస్యలకు పరిష్కారాలను చూపాలన్నారు. మొత్తం 364 పరిశోధనా పేపర్స్ వచ్చాయని , అందులో నుంచి 52 బెస్ట్ పేపర్ ని షాట్ లిస్టు చేశారనీ తెలియజేశారు. సెక్రటరీ కోయి శేఖర్ ,ప్రిన్సిపాల్ డా.పి.బాబు, అకాడెమిక్ డైరెక్టర్ డా.కె.హరి బాబు, కాన్ఫరెన్స్ కన్వీనర్ డా.చిట్టినేని అరుణ, కేఎల్ యు ప్రిన్సిపాల్ డాక్టర్ ఉయ్యూరు కృష్ణారెడ్డి, పీవీపీ సిద్ధార్థ కాలేజ్ అసోసియేట్ ప్రొఫెసర్ పసుపులేటి సాయి కృష్ణ, ఆర్వీఆర్ కళాశాల నుండి శ్రీకృష్ణ, కళాశాల అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు మరియు వివిధ కళాశాల అధ్యాపకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమం

ప్రత్తిపాడు, జూన్ 18, ప్రభాతవార్త : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి, సంక్షేమ సమాంతరంగా ముందుకు సాగుతున్నాయని ప్రత్తిపాడు శాసనసభ్యులు డాక్టర్ బూర్ల రామాంజనేయులు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి దిగ్విజయంగా రెండేళ్ల పాలన పూ పూర్తయిన సందర్భంగా గుంటూరు జిల్లా కేంద్రంగా శ్రీ సత్య సాయి స్పిర్చువల్ సిటీలో రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం జిల్లాస్థాయి విజయోత్సవ భారీ బహిరంగ సభ గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, జిల్లా ఇంచార్జ్ మంత్రి కందుల దుర్గేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజల విశ్వాసాన్ని చూరగొని, రాష్ట్రంలో సంక్షేమం మరియు అభివృద్ధిని రెండు కళ్లుగా భావించి ముందుకు సాగుతున్న



ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడని తెలియజేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి, సంక్షేమం సమాంతరంగా ముందుకు సాగుతున్నాయని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ సమన్వయంతో ప్రజలకు ఇచ్చిన హామీలను అత్యధిక భాగం అమలు చేశారని వివరించారు. అన్నా క్యాంటీన్లో పునరుద్ధరణ, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, తల్లికి వందనం, దీపం 2.0 పథకం, అన్నదాత సుఖీభవ, యువతకు నైపుణ్యాభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పన, త్రాగునీటి ప్రాజెక్టులు, రహదారుల అభివృద్ధి వంటి కార్యక్రమాలు రాష్ట్ర ప్రజల జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకొస్తున్నాయని చెప్పారు. అలాగే ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఇప్పటివరకు దాదాపుగా 1468 కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేపట్టామని, ఇవన్నీ వైసిపి నాయకులకు కనబడటం లేదా,మేము తెచ్చిన పెట్టుబడులపై, కూటమి ప్రభుత్వం స్థాపించిన పరిశ్రమలపై, మేము ఈ రెండు సంవత్సరాలలో కల్పించినటువంటి ఆరు లక్షలు పైగా ఉద్యోగ కల్పనపై మాట్లాడండి, అంతేకానీ మహిళలపై ఇలా మాట్లాడడం సరికాదని కాదని వైసిపి నాయకులను హెచ్చరించారు. వైసిపి నాయకులు చేసే వికృత పోకడలు సభ్య సమాజం తలదించుకునేలా ఉంటుందని, జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం మరియు వైకాపా నాయకులు రాజకీయానికే అనర్హులన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ , ఎమ్మెల్యేలు డాక్టర్ బూర్ల రామాంజనేయులు, ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, తెనాలి శ్రావణ్ కుమార్, మొహమ్మద్ నజీర్, గల్లా మాధవి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పిల్లి మాణిక్యారావు, గాదె వెంకటేశ్వరరావు, దేగల ప్రభాకర్, పెద్దఎత్తున కూటమి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## క్షయ వ్యాధి నిర్మూలనకై ప్రత్యేక చర్యలు

తెనాలి రూరల్ జూన్18(ప్రభాతవార్త): హ్యాండ్ హెల్డ్ ఎక్స్ రే స్క్రీనింగ్ కార్యక్రమం లో భాగంగా, గురువారం అంగలకుదురు గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న వర్క్ ప్లేస్ సెట్టింగ్స్ అయిన,శంకర సాయి కన్జ్యూమర్ ప్రొడక్ట్స్ సోప్స్ తయారీ కంపెనీలో పనిచేస్తున్న వర్కర్స్ కీ హ్యాండ్ హెల్డ్ ఎక్స్ రే మిషన్ ఉపయోగించి 67 మందికి చాతి ఎక్స్ రే తీయడం జరిగినది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గుంటూరు జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్ బి సౌజన్య మాట్లాడుతూ, గుంటూరు జిల్లా క్షయ వ్యాధి నిర్మూలనా అధికారి డా .దాసరి శ్రీనివాసరావు ఆదేశాలతో తెనాలి మరియు పరిసర ప్రాంతాలలో హ్యాండ్ హెల్డ్ ఎక్స్ రే ద్వారా అనుమానిత క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ప్రత్యేకమైన స్పెషల్ డ్రైవ్ చేస్తున్నామని తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెనాలి టీబీ యూనిట్ సూపర్వైజర్ డా. పల్లికొండ రవికుమార్ మాట్లాడుతూ, క్షయ వ్యాధి నిర్మూలన లో భాగంగా హైరిస్క్ ప్రాంతాలలో అంటే కంపెనీలలో పనిచేస్తున్న వర్కర్స్ కు క్షయ వ్యాధిపై అవగాహన కలిగించి చెస్ట్ ఎక్స్ రే ద్వారా నిద్రావస్తలో ఉన్న క్షయ వ్యాధి లక్షణాలను గుర్తించి క్షయ వ్యాధి రాకుండా ప్రివెన్షన్ థెరపీ ఇవ్వడం జరుగుతుందని తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో హెల్త్ విజిటర్ వాకా దిలీప్ కుమార్, కంపెనీలో ఏఎన్ఎం డివి రత్న, ఆశా కార్యకర్తలు ఆర్ సుగుణ, జి రిబ్కారాణి కంపెనీలో పనిచేస్తున్న మేనేజర్ సుబ్బారావు,సిబ్బంది వర్కర్స్ పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వ రెండేళ్ల విజయోత్సవ సభ కు ఏర్పాట్లు

తెనాలి జూన్18(ప్రభాతవార్త): జూన్ 20వ తేదీన కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తైన సందర్భంగా పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించబోయే విజయోత్సవ సభకు ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. ఇందుకోసం స్థానిక మార్కెట్ ఏరియాలో జరగనున్న కూటమి విజయోత్సవ సభ



కార్యక్రమ ఏర్పాట్లను, మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు, మున్సిపల్ ఇంజనీర్ పినప శ్రీకాంత్ తదితరులతో కలిసి పరిశీలించారు. ప్రణాళిక బద్ధంగా పనులు పూర్తి చేయాలని ఎవరి కేటాయించిన విధులు వారు సక్రమంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీమతి వాణి , ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మొవ్వ ఏసుబాబు, ఏఈ సూరిబాబు, పురపాలక సిబ్బంది పాల్గొన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి మరియు సుపరిపాలనతో ముందుకు సాగుతున్న మన కూటమి ప్రభుత్వం రెండేళ్ల విజయవంతమైన ప్రస్థానాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఈ విజయోత్సవ సభ కు ప్రజలందరూ విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా పురపాలక సంఘం తరపున ఆహ్వానం పలుకుతున్నామని అధికారులు తెలిపారు.

### బీసీవై పార్టీ అధినేత రామచంద్రయాదవ్ జన్మదినం సందర్భంగా అన్నదానం

తెనాలి జూన్18(ప్రభాతవార్త): బీసీవై పార్టీ అధినేత బోడే రామచంద్ర యాదవ్ జన్మదినం సందర్భంగా గురువారం, తెనాలి నియోజకవర్గ శ్రీ కృష్ణ యాదవ్ యూత్ ఆధ్వర్యంలో, శ్రీ శివలింగేశ్వర స్వామి భక్త బృంద సేవా సమితి అధ్యక్షులు కుర్రా శ్రీను పర్యవేక్షణలో, పట్టణంలోని రైల్వే స్టేషన్ వద్ద, వృద్ధులు, నిరాశ్రయులు, వికలాంగులు నిస్సహాయులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, బీసీవై పార్టీ స్థాపించటం ద్వారా యాదవ సామాజిక వర్గానికి రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు తీసుకువచ్చిన బోడె రామచంద్ర యాదవ్ కి సంఘీయులందరూ అండగా నిలవాలని, రామచంద్ర యాదవ్



ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని,ఆ భగవంతుని ఆశీస్సులతో నిండు నూరేళ్ళ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని,ప్రజాసేవలో మరింతగా ఎత్తుకు ఎదిగి, పేదలు అణగారిన వర్గాలు వెనుకబడిన ప్రజల సంక్షేమానికి మరింతగా సేవ చేయాలని కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో, తట్టుకూళ్ల అశోక్ యాదవ్, నల్లగొర్ల శివన్నారాయణ, కోపల్లె హరీష్, బోడపాటి రామయ్య, దానబోయిన ఫణి, దేశ బోయిన గణేష్, తోట ద్వారకా కృష్ణ, టి.కిరణ్, రాజు, సోను మరియు శ్రీ శివలింగేశ్వర స్వామి భద్ర బృంద సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

## మున్సిపల్ అధికారులతో డిఈఓ సమీక్ష

తెనాలి జూన్18(ప్రభాతవార్త): మున్సిపల్ కార్యాలయంలో జిల్లా విద్యాశాఖ అధికారి మరియు తెనాలి అర్బన్ ప్రత్యేక అధికారి డాక్టర్ షేక్ సలీం భాష, గురువారం వివిధ శాఖల అధికారులతో



సమీక్ష సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ రామా అప్పలనాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రస్తుతం జరుగుతున్న వివిధ రకాల సర్వేల గురించి అధికారులతో సమీక్షించారు. అర్బన్ పరిధిలో ఎన్ని ఎస్ ఎల్ జి గ్రూపులు ఉన్నది, వాటి పురోగతి వివిధ అంశాలను గురించి మెప్మా సీఎం విజయ కుమారిని అడిగి తెలుసుకున్నారు. యోగాంధ్ర,ఈ కేవైసీ పెండింగ్ ,పెండింగ్ సర్వేలపై ఎవరీ పరిధిలో వారు క్షుణ్ణంగా పరిశీలించి పురోగతిని సాధించాలని సూచించారు. పాఠశాలలో అభివృద్ధి పనులకు సంబంధించి మున్సిపల్ అధికారులతో కలిసి అంచనాలు తయారు చేయాలని మండల విద్యాశాఖ అధికారి లక్ష్మీనారాయణ కిసూచించారు. సర్వేలు వివిధ అంశాలపై మున్సిపల్ కమిషనర్ పర్యవేక్షించాలని కోరారు. మున్సిపల్ ఇంజనీర్ పినప శ్రీకాంత్, ఆరోగ్యశాఖ అధికారి మొవ్వ ఏసుబాబు ,మున్సిపల్ మేనేజర్ జయకర్, సచివాలయ విభాగ మేనేజర్ శారదాదేవి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### విత్తనాలు ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు : మండల ప్రత్యేక అధికారి అభినవ్.

కొల్లిపర జూన్18(ప్రభాతవార్త): విత్తనాలు ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల ప్రత్యేక అధికారి అభినవ్ పేర్కొన్నారు గురువారం మండల పరిధిలోని తూములూరు కొల్లిపర గ్రామాల్లో ఎరువుల దుకాణాలను తాసిల్దార్ సిద్ధార్థ మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరెడ్డి తో కలిసి ఆయన తనిఖీ చేశారు షాపులో ఉన్న బిల్లులను గోడౌన్ లో ఉన్న స్టాక్ ను పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను మోసం చేస్తే షాపుల యజమానులపై క్రిమినల్ కేసులు బనాయినట్లు తెలియజేశారు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎరువుల అమ్మకాలు జరపాల న్నారు మండల వ్యవసాయా ధికారి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు ఇన్చార్జి ఎంపీడీవో భార్గవ్ పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు.



## సమగ్ర సస్యరక్షణ పద్ధతులపై అవగాహన

ప్రత్తిపాడు, జూన్ 18, ప్రభాతవార్త : గులాబీ రంగు పురుగు నివారణకు సమగ్ర సవ్య రక్షణ పద్ధతులపై రైతులకు ఫిరంగిపురం మండల పరిషత్ కార్యాలయ సమావేశం మందిరంలో అవగాహన సదస్సు గురువారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వ్యవసాయ శాస్త్రవేత్తలు రాజేష్ చౌదరి, సైంటిస్ట్ సృజిని, ప్రిన్సిపల్ సైంటిస్ట్ సాయిల్ సైన్స్ మరియు ఆత్మ డిప్యూటీ డైరెక్టర్ తోటకూర శ్రీనివాసరావు, గుంటూరు ఏడిఏ మోహన్రావు హాజరై మాట్లాడుతూ..ప్రత్తిపంటలో గులాబీ రంగు కాయతొలచే పురుగు నివారణకు 45 రోజులు పైరులో



లింగాకర్షక బుట్టలు అమర్చడం, పంట మార్పిడి చేయడం, పంటను పొడిగించకుండా ఉండడం, భూమిని లోతుగా దున్నడం, ప్రత్తి తీసివేసిన తర్వాత మోళ్లను మేకలను వదిలి మేపించడం, చివరి దశలో సింథటిక్ పైరిత్రాయిడ్స్ ని స్ప్రే చేయడము వంటి చర్యలు తీసుకుంటే గులాబీ రంగు కాయ తొలుచు పురుగును సమర్థవంతంగా నివారించవచ్చని తెలిపారు. అలాగే రసం పీల్చుపురుగు నివారణకు వేప గింజల ఇమిడా క్లోప్రేడ్ ఎసిటామిక్రిడ్ మందులను పిచికారీ చేసుకోవాలన్నారు. శాస్త్రవేత్తలు సూచించిన విధంగా ఎరువులను వాడటం, భూసార పరీక్షలకు ఆధారంగా ఎరువులను వాడుకోవడం లాంటివి రైతులు ఆచరించాలని వివరించారు. శిక్షణా తరగతులకు హాజరైన రైతులందరికీ ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి జె.మోహన్రావు,15 గ్రామాలకు చెందిన రైతులు, వ్యవసాయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సంగంజాగర్లమూడి జెడ్పి పాఠశాలను సందర్శించిన డిఈఓ సలీంబాషా

తెనాలి రూరల్ జూన్18(ప్రభాతవార్త): గుంటూరు జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షేక్ సలీం బాషా తెనాలి మండలంలోని ఎస్కెవిసిఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సంగం జాగర్లమూడి ని తనిఖీ చేశారు. పాఠశాలలోని అన్ని తరగతుల్లో గల విద్యార్థుల వివరాలు తీసుకొని వారి యొక్క సామర్థ్యాలను తరగతి వారీగా పరిశీలించారు. పాఠశాలలో అమలవుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్నబడి భోజనాన్ని పరిశీలించి రుచి చూశారు ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి తమ



క్యాచ్ మెంట్ ఏరియాలో ఉన్న పిల్లలందరినీ తల్లిదండ్రులు మరియు గ్రామస్తుల సహకారంతో ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని, మధ్యాహ్న భోజన నాణ్యత విషయంలో రాజీ పడవద్దని, ప్రతి ఒక్కరికి వెంటనే పాఠ్యపుస్తకాలు నోటు పుస్తకాలు మరియు కిట్లు అందించాలని, నూతనంగా చేసిన విద్యార్థుల స్థాయిని బట్టి వారికి బోధించాలని, తల్లికి వందనం అర్హుల జాబితాను జాగ్రత్తగా చూసుకోవాలనిఅన్నారు అనంతరము మండల ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు తెనాలి మండల విద్యాశాఖ అధికారులు లక్ష్మీనారాయణ మరియు జయంతి బాబుమాట్లాడుతూ, తెనాలి మండలంలో అన్ని యాజమాన్యాల పాఠశాలల పరంగా ఎటువంటి సమస్యలు లేకుండా నిరంతరము పర్యవేక్షణ చేస్తున్నామని, మండలంలోని అన్ని పాఠశాలలలో కిట్స్ పంపిణీ పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉర్దూ పాఠశాల సమస్యల పరిష్కారానికి మంత్రి మనోహర్ భరోసా

తెనాలి జూన్18(ప్రభాతవార్త): తెనాలి పట్టణం లోని పాత సత్యనారాయణ టాకీస్ రోడ్లోని ఉర్దూ పాఠశాలలో ప్రహరీ గోడ కూలిపోవడం, షెడ్ పైనుంచి వర్షం లోపలికి కారడం వంటి సమస్యలను, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ షేక్ ఇస్మాయిల్ బెగ్ గురువారం మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్య తెలుసుకున్న మంత్రి వెంటనే స్పందించి, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు త్వరగా



పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. తెనాలి ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించే మంత్రి మనోహర్ తక్షణమే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా సమస్యలపై వెంటనే స్పందించినందుకు మంత్రి మనోహర్ కు స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## మురుగుకాల్వలో వ్యర్థాలు తొలగించండి: మున్సిపల్ కమీషనర్

తెనాలి జూన్18(ప్రభాతవార్త): పట్టణ పరిధిలో మురుగు కాల్వల్లో వ్యర్థాలు వేయకుండా చూడాలని, మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు, పారిశుధ్య సిబ్బంది కి సూచించారు. గురువారం పట్టణంలోని దేవి చౌక్ ఏరియాలో, జంపని కాలువలో జరుగుతున్న పూడికతీత పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. తరచూ వర్షాలు కురుస్తున్నందున కాలువలలో నీటిపారుదలకు ఆటంకం లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. పట్నంలోని ప్రధాన కాలువలతో పాటు శివారు ప్రాంతాలలో మురుగు నీరు పారుదల ను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. కొత్తపేటలోని రైతు బజార్ ను సందర్శించి దుకాణదారులతో మాట్లాడారు. మిగిలిపోయిన కూరగాయలు క్యాబేజీ ఆకు వంటివి ఎక్కడబడితే అక్కడ వేయవద్దని పురపాలక సంఘ వాహనాలకు అందించాలని సూచించారు.



రైతు బజార్ వద్ద పరిశుభ్రతను పాటించాలని వినియోగదారులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని చెప్పారు. రైతు బజార్ వద్ద వచ్చే తడి చెత్తను వర్మీ కంపోస్ట్ తయారీ కేంద్రానికి తరలించాలని సిబ్బంది సూచించారు. ప్రధాన తపాలా కార్యాలయం వద్ద రోడ్డు మార్జిన్లో కాలువల పైన ఉన్న ఆక్రమణలు టౌన్ ప్లానింగ్ సిబ్బంది చేత తొలగించారు. ఆక్రమణలకు పాల్పడిన వారికి అపరాధ రుసుము విధించారు. టౌన్ ప్లానింగ్ సిబ్బంది ఆయా ప్రాంతాల్లో పర్యవేక్షిస్తూ రోడ్లపైన కాలువలు పైన ఆక్రమణలు జరగకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం పదో వార్డులోని సామూహిక మరుగుదొడ్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని చెప్పారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని పారిశుద్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని శానిటేషన్ సిబ్బందికి సూచించారు. చెత్త సేకరణ చెత్త తరలింపు , కాలువలు శుభ్రం చేయించుట వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఇన్చార్జి సానిటరీ ఇన్స్పెక్టర్ వి వెంకటేశ్వర్లు సానిటరుసెక్రటరీలు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అనంతరం చినరావూరు జగడగుంటపాలెం ప్రధాన కాలువ పూడికతీత పనులను ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మొవ్వ ఏసుబాబు తో కలిసి పరిశీలించారు. కాలువలో ఉన్న చెత్త ఇతర వ్యర్థాలను జెసిపి ద్వారా తొలగింపజేశారు. కాలువలలో చెత్త ఇతర వ్యర్థాలు వేయకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. సానిటరీ సెక్రటరీలు సిబ్బంది పాల్గొన్నారు

## .అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు..!

ప్రత్తిపాడు (వట్టిచెరుకూరు), జూన్ 18, ప్రభాతవార్త : మండలంలో అధికార పార్టీకి చెందిన కొందరు చోటామోటా నేతలు ఒక బృందంగా ఏర్పడి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండానే మట్టి తవ్వకాలు జరిపి జేబులు నింపుకుంటున్నారు. గత రాత్రి ముట్లూరు, కోవెలమూడి గ్రామాల మధ్యలో ఉన్న రెడ్డిపాలెం డ్రైన్ లో పాయింట్ 9 నుండి రెండు మధ్య రాత్రి సమయంలో జేసిబీ వినియోగించి ట్రాక్టర్లతో మట్టి తవ్వకాలు జరిపినట్లు పైగ్రామాలలో చర్చ జరుగుతుంది. మట్టి దందా చేపట్టి, ఎలాంటి అనుమతలు తీసుకోకుండానే యథేచ్ఛగా మట్టి రవాణా చేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఎంత త్రవ్వినా అడిగేవారు లేరని, ఎలాంటి అనుమతులు లేకుండా వారి ఇష్టం వచ్చినట్లు త్రవ్వకాలు జరిపి జేబులు నింపుకుంటున్నారని గ్రామస్తులు తెలియజేస్తున్నారు. వాల్టా చట్ట ప్రకారం చెరువులు, పొలాల్లో మట్టి త్రవ్వకాలకు సంబంధించి రెవిన్యూ, గనుల శాఖల అనుమతులు పొందాల్సి ఉంది. అక్రమంగా తరలిస్తున్న ప్పటికీ అధికారులు మామూళ్ల మత్తులో ఉండి అటువైపు కన్నెత్తి చూడడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ కాలువలో అధికార పార్టీ నేతల



అండదండలతో జేసీబీతో మట్టి తవ్వకాలు చేపట్టి ట్రాక్టర్లతో తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఈ మాసంలోనే వ్యవసాయ సీజన్ ప్రారంభం కానుంది. కాలువలలోని మట్టిని జెసిపిలతో తీసి కట్టలను లెవల్ చేయాల్సి ఉంది. వరదలు సమయంలో కాలువలు నీటితో నిండి కట్టల పైకి నీరు పొంగే అవకాశం ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు కాలువ కట్టలను లెవల్ చేయకుండా అక్రమార్కులకు సహకరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదే అదునుగా భావించిన మట్టి అక్రమార్కులు కాలువ కట్టలను లెవెల్ చేయకుండా మట్టి త్రవ్వకాలు జరుపుతున్నారు. కోవెలమూడి, చేబ్రోలు, ముట్లూరు, పాతరెడ్డిపాలెం, తదితర గ్రామాలతో పాటు మండల కేంద్రానికి మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు విమర్శలు ఉన్నాయి. ఒక ట్రాక్టర్ మట్టికి రూ.1200 నుండి రూ. 1500ల వరకు విక్రయిస్తున్నట్లు సమాచారం. ఇలా సుమారు 500 ట్రాక్టర్లు మట్టి త్రవ్వకాలు జరిపినట్లు గ్రామస్తులు అంటున్నారు. గత మూడు రోజుల నుండి జరిపిన త్రవ్వకాలతో సుమారు రూ.8 నుండి రూ.10లక్షల వరకు మట్టి విక్రయాలు జరిపినట్లు గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. ఇంత జరుగుతున్న అధికారుల్లో స్పందన రాకపోవడం ఆస్వాస్పదంగా ఉంది. మట్టిదందా రాత్రి వేళ జరుగుతున్నా కనీసం అధికారులు ఎవరూ పట్టించకపోవడంపై మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి అక్రమ దందాకు పాల్పడుతూ, ప్రభుత్వాదాయానికి గండి కొడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు, మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. డ్రైన్ పరిసర ప్రాంతాల రైతులు ఈ విషయమై వచ్చే సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగే పిజిఆర్ఎస్ లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలియ వచ్చింది.

## ఆయుర్వేద వైద్యంలో ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు: ఆయుర్వేద వైద్యాధికారి అర్చన

కొల్లిపర జూన్18(ప్రభాతవార్త): ఆయుర్వేద వైద్యం వలన ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని వైద్యులను సంప్రదించి మందులు వాడుకోవటం మంచిదని ఆయుర్వేద వైద్యాధికారి అర్చన పేర్కొన్నారు గురువారం మండల కేంద్రం కొల్లిపర శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో ఆయుర్వేద



వైద్యాధికారములు ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు షుగర్ బీపీ వ్యాధిగ్రస్తులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తగిన సూచనలు సలహాలు ఇచ్చారు ఈ సందర్భంగా అర్చన మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యం మన పూర్వీకుల నుండి అనాదిగా వస్తుందన్నారు ఆయుర్వేద వైద్య విధానంలో అన్ని రకాల వ్యాధులకు వైద్యం పొందవచ్చునని తెలిపారు ఆయుర్వేద వైద్యానికి రాబోయే రోజుల్లో మరింత ఆదరణ పెరుగుతుందన్నారు ఆయుర్వేద వైద్యం ద్వారా శరీరం మనసు ఆత్మ పర్యావరణం మధ్య సమతుల్యతను ప్రోత్సహించే భారతదేశ సంప్రదాయ వైద్య విధానం అన్నారు నేటి దైనందిన కార్యక్రమాల్లో ఆయుర్వేద వైద్యం వలన ఎంతో మేలు జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో ఆయుర్వేద సిబ్బంది అరుణ,కృష్ణ,ఏ.కృష్ణ ప్రసాద్ పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

## అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలి:మండల ప్రత్యేక అధికారి అభినవ్

కొల్లిపర జూన్18(ప్రభాతవార్త): అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని కొల్లిపర మండల ప్రత్యేక అధికారి ఎన్. అభినవ్ సూచించారు గురువారం మండల కేంద్రం కొల్లిపర మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో ఆయన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు ఈ సమావేశానికి ఇన్చార్జి ఎంపీడీవో భార్గవ్ అధ్యక్షత వహించారు తొలుత ప్రభుత్వ అధికారులతో శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు ఈ సందర్భంగా భార్గవ్ మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నాయని గ్రామాల్లో పారిశుద్ధం పట్ల



ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు ఆరోగ్య సిబ్బంది కూడా మెరుగైన వైద్యం సేవలు అందించాలని సూచించారు ప్రజల నుంచి ఎటువంటి సమస్యలు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులదే అన్నారు గ్రామాభివృద్ధిపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్యం పై తగిన శ్రద్ధ తీసుకోవాలని సూచించారు ఈ సమావేశంలో తహసిల్దార్ సిద్ధార్థ పరిపాలనాధికారి కిషోర్ కుమార్ మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరెడ్డి వివిధ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి అధికారులు తమ వంతు కృషి చేయాలి :ఎంపీపీ భీమవరపు పద్మావతి.

కొల్లిపర జూన్18(ప్రభాతవార్త): గ్రామాల అభివృద్ధికి అధికారులు తమ వంతు కృషి చేయాలని కొల్లిపర మండల ఎంపీపీ భీమవరపు పద్మావతి పేర్కొన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్



కార్యాలయంలో నాణ్యమైన గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై మండల స్థాయి అధికారులతో జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు.ఈ కార్యక్రమానికి పరిపాలనాధికారి కిషోర్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ, ప్రణాళిక బద్ధంగా గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఇన్చార్జి ఎంపీడీవో భార్గవ్ మాట్లాడుతూ,గ్రామాలు మరింత అభివృద్ధి చెందాలంటే తగిన ప్రణాళికల రూపొందించుకోవాలన్నారు. గ్రామాల ప్రజలు భాగస్వామ్యంతో ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. తాగునీరు,పారిశుధ్యం, రహదారులు,విద్య,ఆరోగ్యం, వ్యవసాయం,మహిళా సాధికారత, యువజన అభివృద్ధి వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ అవుతు సాంబిరెడ్డి డిప్యూటీ ఎంపీడీవో దానయ్య వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## కొల్లిపర అఖండ జ్యోతి మఠం యోగివేమన విగ్రహ ప్రతిష్ట

కొల్లిపర జూన్18(ప్రభాతవార్త): మండల కేంద్రమైన కొల్లిపర లో యోగివేమన అఖండ జ్యోతి పీఠం నందు గురువారం కార్తీక వేత్త యోగివేమన మరియు సెనగల కోటిలింగా చార్యుల విగ్రహాల ప్రతిష్టా కార్యక్రమం నిర్వహించారు.విగ్రహాల ప్రతిష్ట మహోత్సవం



పురస్కరించుకొని విచ్చేసిన భక్తులకు నిర్వాహకులు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ ప్రతిష్ట మహోత్సవంలో కొల్లిపర గ్రామం నుండి కాకుండా సమీప గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ఒంటరి వ్యక్తిపై దాడిచేసి నిలువు దోపిడీ

కొల్లిపర జూన్18(ప్రభాతవార్త): కుటుంబ సభ్యులు ఊరికి వెళ్ళగా, ఇంట్లో ఒంటరిగా ఉంటున్న వ్యక్తిపై దాడి చేసి అతని ఒంటిపై గొలుసు బంగారపు గొలుసు ఉంగరాలతో వడయించిన దొంగ




ఉదంతమిది. మండల కేంద్రం కొల్లిపర గ్రామంలో గురువారం తెల్లవారుజామున గ్రామానికి చెందిన రైతు కొల్లి వెంకట శ్రీనివాసరెడ్డి కుటుంబ సభ్యులు ఊరికి వెళ్ళగా గత రెండు రోజుల నుండి ఇంట్లో ఒంటరిగా ఉంటున్నాడు ఇది గ్రహించిన అపరిచిత వ్యక్తి గురువారం తెల్లవారుజామున నాలుగు గంటలకు శ్రీనివాసరెడ్డి(56) ఇంట్లోకి చొరబడి పశువులకు మేత మే వెయ్యటానికి వెళ్లిన అతనిపై చీకట్లో కాపు కాచి దాడి చేసి ఒంటిమీద ఉన్న బంగారపు ఉంగరం గొలుసుతో పాటుగా సెల్ఫోన్ తీసుకొని పరారయ్యాడు ఈ ఘటనపై రైతు కొల్లి వెంకట శ్రీనివాసరావు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు.

## మహిళలు, చిన్నారుల రక్షణే ప్రథమ ప్రాధాన్యం

బాపట్ల,జూన్18,ప్రభాతవార్త,ప్రతినిధి: కష్టాల్లో ఉన్న మహిళలు, చిన్నారులకు అత్యవసర పరిస్థితుల్లో అందించే సేవలు మరింత సమర్థవంతంగా, సకాలంలో అందేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని బాపట్ల జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం బాపట్ల జిల్లా కేంద్రంలోని "సఖి వన్ స్టాప్ సెంటర్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సెంటర్ పరిసరాలను పరిశీలించిన కలెక్టర్.. అక్కడ అందుతున్న సేవలపై తీవ్ర ఆరా తీశారు.హింసకు గురై ఆశ్రయం కోసం వచ్చే మహిళలు, బాలికలకు అందిస్తున్న వైద్య, న్యాయ సహాయం, కౌన్సెలింగ్ విధానంపై సిబ్బందితో మాట్లాడారు. బాధితుల వివరాల రికార్డులను, కేసుల పరిష్కార సరళిని స్వయంగా తనిఖీ చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రతి ఒక్క సేవ బాధితురాలికి సలక్షణంగా అందాలని స్పష్టం చేశారు. మహిళలు, బాలికల భద్రతకు సంబంధించిన ఫిర్యాదులు అందిన వెంటనే సిబ్బంది స్పందించాలన్నారు. పోలీస్, వైద్య, న్యాయ శాఖలతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ బాధితులకు తక్షణ ఉపశమనం కలిగించాలన్నారు.సెంటర్‌కు వచ్చే ప్రతి కేసును అత్యంత సున్నితంగా పరిగణించాలని, బాధితుల వ్యక్తిగత వివరాల గోప్యతను కాపాడటం సిబ్బంది ప్రాథమిక బాధ్యతని గుర్తుచేశారు.సెంటర్‌లో మౌలిక సదుపాయాల నిర్వహణ అద్దంలా ఉండాలన్నారు. పరిశుభ్రత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ఆకస్మిక తనిఖీ నేపథ్యంలో వన్ స్టాప్ సెంటర్ సిబ్బంది అప్రమత్తమయ్యారు. కలెక్టర్ వెంట జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ మరియు సాధికారత అధికారిణి రాధామాధవి, బాపట్ల మున్సిపల్ కమిషనర్ ఎం. హాసిని, డీఈ కృష్ణారెడ్డితో పాటు సఖి కేంద్రం ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు. అధికారులు తమ పరిధిలోని సమస్యలను కలెక్టర్‌కు వివరించగా, వాటి పరిష్కారానికి ఆయన సానుకూలంగాస్పందించారు ,

## కర్లపాలెం మండలంలోని రేషన్ డీలర్లతో తహశీల్దార్ రవీంద్ర కుమార్ సమావేశం

కర్లపాలెం,జూన్18,ప్రభాతవార్త:కర్లపాలెం మండల నూతన తహసీల్దార్ రవీంద్ర కుమార్ మండలంలోని రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా అర్హులైన లబ్ధిదారులకు నిత్యావసర సరుకులను సకాలంలో, పారదర్శకంగా పంపిణీ చేయాలని సూచించారు.రేషన్ పంపిణీలో ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించాలని డీలర్లకు సూచించారు. ఈపాస్ యంత్రాల వినియోగం, బయోమెట్రిక్ ధృవీకరణ, స్టాక్ నిర్వహణ, పంపిణీ రికార్డుల నిర్వహణ వంటి అంశాలపై డీలర్లకు అవగాహన కల్పించారు.ఈ సమావేశంలో బాపట్ల జిల్లా రేషన్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చెరుకూరి వెంకటేశ్వరరావు, రేషన్ డీలర్ మందపాటి పరమానంద కుమార్ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని రేషన్ డీలర్లు తమ సమస్యలు, సూచనలను ఎమ్మార్వో దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని ఎమ్మార్వో తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని రేషన్ డీలర్లు, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై ఎటువంటి అపోహలు పెట్టుకోవద్దు

### నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్ఓ కె.మయూర్ అశోక్

గుంటూరు కార్పొరేషన్, జూన్ 18 ( ప్రభాత వార్త ) : గుంటూరు నగరంలోని కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియ పై రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎటువంటి అపోహలు పెట్టుకోవద్దని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్ఓ కె.మయూర్ అశోక్ తెలిపారు. గురువారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో పోలింగ్ స్టేషన్ల ముసాయిదా ప్రతిపాదన, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) పై నగరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ



సందర్భంగా కమిషనర్ ప్రతిపాదిత నూతన పోలింగ్ స్టేషన్ల పై సూచనలు, అభ్యంతరాల పై చర్చించి, అనంతరం సర్ పై మాట్లాడారు. కేంద్ర,, రాష్ట్ర ఎన్నికల సంఘాల మార్గదర్శకాల మేరకు గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియ ఈ నెల 15 నుంచి జూలై 14 వరకు జరుగుతుందన్నారు. ఈ ప్రక్రియ నిర్వహించుట వలన కొంతమంది ప్రజలు, రాజకీయ పార్టీల వారు తమ ఓట్లు తొలగిపోతాయని అపోహలు చెందుతున్నారని, ప్రజలు రాజకీయ పార్టీల ప్రతినిధులు అటువంటి అపోహలు చెందకుండా ఇంటికి వచ్చిన బిఎల్ఓలకు సరైన సమాచారం ఇచ్చి సహకరించాలని కోరారు. ఈ సర్ ప్రక్రియలో భాగంగా 2002 నాటి ఓటర్ల జాబితాను ప్రస్తుత జాబితాతో క్షుణ్ణంగా పరిశీలిస్తారని, ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటు హక్కు ఉన్నవారిని గుర్తించడంతో పాటు, పాత జాబితాలో ఉండి ప్రస్తుతం అక్కడ లేని వారి వివరాలను సేకరిస్తారన్నారు. సర్వే సమయంలో బీఎల్ఓలు ఇచ్చే రెండు ఫారాలను పూర్తి చేసి, ప్రజలు వారికి అందజేయాల్సి ఉంటుందని తెలిపారు. ఓటర్ల జాబితా రూపకల్పనలో ఎలాంటి లోపాలు లేకుండా సిబ్బంది సర్వే చేస్తున్నారని, లాక్ చేసి ఉన్న ఇళ్లను మూడు సార్లు సందర్శిస్తారని తెలిపారు. రానున్న శనివారం బిఎల్ఓ, బిఎల్ఎ, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. కావున రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రజలు బీఎల్ఓలకు తగిన సమాచారం ఇచ్చి ఈ ఓటర్ల జాబితా సవరణను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధుల సూచనలు, అభిప్రాయాలను వెల్లడించగా వాటిని పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశం నందు పశ్చిమ నియోజకవర్గ ఈఆర్ఓ, అదనపు కమిషనర్ సాంబశివరావు, డిప్యూటీ కమిషనర్, వెస్ట్ ఏఈఆర్ఓ సి.హెచ్ శ్రీనివాస్, డిటి నాగమల్లేశ్వరావు, ఆమాద్మి పార్టీ సేవ కుమార్, బియస్పి వాసు, బిజెపి రామకృష్ణ, సిపియం నళినికాంత్, కాంగ్రెస్ జానీ బాష, టిడిపి ఓంకార్,సతీష్, వైస్సార్సీపీ జాన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

బాపట్ల,జూన్18,ప్రభాతవార్త,ప్రతినిధి: సచివాలయాల ద్వారా ప్రజల అందించే సేవలను మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ తెలిపారు.గురువారం ఉదయం జిల్లా



కేంద్రంలోని 12వ వార్డు సచివాలయాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయంలో ప్రజలకు అందిస్తున్న వివిధ సేవలు, నిర్వహిస్తున్న రికార్డులు, దరఖాస్తుల పరిష్కార విధానం, సేవల అందజేతపై మరియు పలు రిజిస్టర్లను పరిశీలించారు.మే నెల 18 నుండి ఈరోజు వరకు ఎన్ని సేవలు అందించారనిసచివాలయంలో ఎన్ని కంప్యూటర్లు,ప్రింటర్లు, స్కానరు బయోమెట్రిక్ డివైడర్స్, పింగర్ ప్రింటర్, లామినేషన్,వెబ్ కెమెరా వంటివి ఉన్నాయిని పంచాయతీ సెక్రటరీ ని అడిగి తెలుసుకున్నారు.సచివాలయం ద్వారా ప్రజలకు ఎలాంటి సేవలు అందిస్తున్నారని డిజిటల్ అసిస్టెంట్ ను అడగడంతో వివిధ రకాల సర్టిఫికేట్లు ను ఇవ్వడం జరుగుతుందని కలెక్టర్ కు తెలిపారు.అనంతరం బయోమెట్రిక్ హాజరు నమోదును పరిశీలించిన కలెక్టర్, నలుగురు సిబ్బంది ఆలస్యంగా హాజరు నమోదు చేసినట్లు గుర్తించారు. బయోమెట్రిక్ హాజరును నిరక్ష్యం చేసిన సిబ్బందిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. సిబ్బంది నిర్దేశిత సమయానికి విధులకు హాజరుకావడం ప్రతి ఉద్యోగి బాధ్యతన్నారు.ఉద్యోగులు ప్రజల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, కార్యాలయ సమయాలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు.సచివాలయానికి వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సేవలు అందించాలని, పెండింగ్ దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని, ప్రతి సేవను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు.జిల్లా కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ యం.హాసిని,డి ఈ కృష్ణా రెడ్డి,సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## కొత్తపాలెం గ్రామ దేవత శ్రీ బండ్లమ్మ తల్లి దేవాలయంలో ప్రత్యేక పూజలో పాల్గొన్న గాదె మధుసూదన రెడ్డి

పిట్టలవానిపాలెం,జూన్18,ప్రభాతవార్త: పిట్టలవానిపాలెం మండలం, కొత్తపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న గ్రామ దేవత శ్రీ బండ్లమ్మ తల్లి అమ్మవారి దేవాలయము నందు జరిగిన మొక్కుబడి కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి గ్రామ పార్టీ అధ్యక్షులు అక్కల మురళీకృష్ణ రెడ్డి ఆహ్వానం మేరకు వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి మరియు పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త గాదె మధుసూదన రెడ్డి గ్రామానికి విచ్చేసి అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్ర అధికార ప్రతినిధి, వేమూరు నియోజకవర్గ



సమన్వయకర్త వరికూటి అశోక్ బాబు, రేపల్లె నియోజకవర్గం సమన్వయకర్త పిటా నాగ మోహన కృష్ణ, రాష్ట్ర కార్యదర్శి మరియు చీరాల నియోజకవర్గ అబ్జర్వర్ మోదుగుల బసవపునా రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బాలాజీ పాల్గొన్నారు. దెందుకూరి సీతారామరాజు,గోవతోటి విజయ్,దొంతి రెడ్డి కోటిరెడ్డి, మంతెనవారిపాలెం మాజీ లీశిగిది నర్రా శ్రీనివాసరావు, కొత్తపాలెం గ్రామ సర్పంచ్ దోమ వెంకటేశ్వర రెడ్డి,దేగల రవి రెడ్డి,కుంచల వీర రాఘవరెడ్డి,నర్రా నాగ శీను, ఏట్రీ శివారెడ్డి,అక్కల వేణు రెడ్డి,అక్కల నాగిరెడ్డి మరియు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభిమానులు కార్యకర్తలు గ్రామ పెద్దలు,మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రెండేళ్ల పాలన - నమ్మకం, సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమానికి భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ

బాపట్ల,జూన్18,ప్రభాతవార్త,ప్రతినిధి: జిల్లా కేంద్రంలో జరగనున్న "రెండేళ్ల పాలన - నమ్మకం, సంక్షేమం, అభివృద్ధి" కార్యక్రమానికి పోలీస్ శాఖ పరంగా తగిన భద్రతా ఏర్పాట్లు చేపట్టామని జిల్లా



ఎస్పీ ఉమామహేశ్వర్ తెలిపారు. ఈ నెల 19వ తేదీ శుక్రవారం జిల్లా కేంద్రంలోని తూర్పు సత్రం వద్ద నిర్వహించనున్న కార్యక్రమ ప్రాంగణం, ప్రవేశ-నిష్క్రమణ మార్గాలు, స్టాల్స్, గ్యాలరీలు, వీఐపీలు వచ్చే మార్గాలు, ఫుడ్ కోర్టులు, కార్యక్రమానికి విచ్చేసే వీఐపీలు మరియు ప్రజల వాహనాల పార్కింగ్ ప్రదేశాలను ఎస్పీ గురువారం పరిశీలించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు, భద్రతా ఏర్పాట్లపై పోలీస్ అధికారులకు దిశానిర్దేశం చేశారు.బాపట్ల డీఎస్పీ సీహెచ్. చంద్రమోళి, ఏఆర్ డీఎస్పీ పి.కృష్ణంరాజు , ఎస్బీ ఇన్‌స్పెక్టర్ జి. నారాయణ, బాపట్ల టౌన్, రూరల్, రూరల్ సర్కిల్ సీఐలు రాంబాబు, ప్రభాకర్, హరికృష్ణ, ఆర్ఐ మోలుద్దీన్ తదితర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఓటర్ల సర్వేను అత్యంత ప్రాధాన్యతగా తీసుకోవాలి

బాపట్ల,జూన్18,ప్రభాతవార్త,ప్రతినిధి: ఎన్నికల విధుల నిర్వహణలో నిరక్ష్యం వహిస్తే సహించేది లేదని, విధుల పట్ల నిర్లిప్తంగా వ్యవహరించే అధికారులపై కఠిన క్రమశిక్షణా చర్యలు ఉంటాయని బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. ప్రత్యేక సంక్షిప్త సవరణ ఓటర్ల సర్వే ప్రక్రియను అత్యంత ప్రాధాన్యతగా భావించి క్షేత్రస్థాయి సిబ్బంది పనిచేయాలని ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ నుండి జిల్లా, మండల స్థాయి అధికారులతో ఆయన వీక్షణా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు ఎట్టి పరిస్థితుల్లోనూ రాజకీయ పార్టీలకు దూరంగా ఉండాలన్నారు.అధికారులు తమ పనితీరును ఒకసారి పునః పరిశీలించుకోవాలన్నారు.ఓటర్ల సర్వే ప్రక్రియలో ప్రతి ఇంటికీ బీఎల్ఓలు వెళ్లి దరఖాస్తులు అందించడంతో పాటు, ఓటర్ల నుంచి అభిప్రాయ సేకరణపై తప్పనిసరిగా ధృవీకరణ పత్రాలు తీసుకోవాలన్నారు. ఓటర్ల ప్రక్రియ పర్చూరు మండలంలో బాగా జరిగిందని అభినందించిన కలెక్టర్.. కొన్ని మండలాల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.చీరాల: దరఖాస్తుల పంపిణీ కేవలం 15 శాతమే ఉండటంపై సంబంధిత అధికారులను నిలదీశారు.యద్దనపూడి: మండలంలో 21,583 మంది ఓటర్లు ఉండగా.. కేవలం 6,918 మందికే దరఖాస్తులు ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.వేటపాలెం: సూపర్‌వైజర్ సరిగా పనిచేయకపోవడంపై ఆరా తీసారు.కేవలం 678 డిజిటైజేషన్ మాత్రమే చేయడంపై మండిపడ్డారు. క్షేత్రస్థాయి సర్వే జరుగుతూనే, మరోవైపు డిజిటైజేషన్ ప్రక్రియ పక్కాగా సాగాలని స్పష్టం చేశారు.

## సాయికృష్ణ కుటుంబాన్ని పరామర్శించిన అంబటి మురళీకృష్ణ

పొన్నూరు, జూన్ 18,ప్రభాతవార్త: విజయవాడ కృష్ణలంకకు చెందిన కాపు యువకుడు, జనసేన కార్యకర్త గాదె సాయికృష్ణ కుటుంబాన్ని వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ పరామర్శించారు. ఈ సందర్భంగా సాయికృష్ణ తల్లి తన కుమారుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని వేధిపులకు గురి



చేశారన్నారు.అనంతరం లాకప్‌లో అనుమానాస్పద పరిస్థితుల్లో మరణించాడని ఆరోపిస్తూ బావోద్వేగానికి గురయ్యారు. తన కుమారుడి మరణానికి కారణమైన పరిస్థితులపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. సాయికృష్ణ కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని, బాధితులకు అన్ని విధాలా అండగా నిలుస్తామని మామీ ఇచ్చారు. ఈ ఘటనపై ప్రభుత్వం స్పదించి పారదర్శక విచారణ చేపట్టాలన్నారు. అంబటి వెంట వ్యవసాయ మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

## ఏపిఏఐఎంఎస్ 2.0 యాప్‌పై అవగాహన కలిగి ఉండాలి

పొన్నూరు, జూన్ 18,ప్రభాతవార్త: ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఎరువుల విక్రయాలను వ్యవసాయశాఖ సూచించిన యాప్ ద్వారా మాత్రమే జరపాలని అర్బన్ సిఐ రేవు శ్రీనివాస కిషోర్




కుమార్ తెలిపారు. స్థానిక మునిసిపల్ సమావేశ మందిరంలో గురువారం ఎరువుల డీలర్లకు, వ్యవసాయశాఖ రైతు సేవా కేంద్రం సిబ్బందికి యాప్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా సిఐ కిషోర్‌కుమార్ మాట్లాడుతూ ఎరువులు పక్కదారి పట్టకుండా ఉండేందుకు ఈ యాప్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ మాట్లాడుతూ డీలర్లు ఎరువులను కృత్రిమ కొరత సృష్టిస్తే చూస్తూ ఊరుకోమన్నారు. డీలర్లు ఎరువులను యాప్ ద్వారా మాత్రమే విక్రయించాలన్నారు. మండల వ్యవసాయాధికారి రాజవరపు వెంకటేశ్వరరావు వ్యవసాయ మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ మాదల వెంకటేశ్వరరావు, ఎస్సీ కార్పోరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బండ్లమూడి బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

## స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌ను సద్వినియోగం చేసుకోవాలి

పొన్నూరు, జూన్ 18,ప్రభాతవార్త: ప్రతి ఓటరు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌ను సద్వినియోగం చేసుకోవాలని టిడిపి మైనార్టీ నాయకులు పఠాన్ పిరోజ్‌ఖాన్, షేక్ బాజిసాహెబ్‌లు కోరారు. పట్టణంలోని 187వ బూత్ పరిధిలో ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలను బిఎల్వోల సహాయంతో అందజేయడం జరిగింది. ఓటర్లు ఎన్యుమరేషన్ ఫారంలో



అడిగిన విధంగా వివరాలను నమోదు చేసి మళ్ళీ బిఎల్వోలకు అందజేయాలని కోరారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమంలో పాల్గొని తమ ఓటును సరిచూసుకోవాలని కోరారు.

## ఎస్ఐఆర్‌తో రక్తపాత రహిత రాజకీయ నరమేధం చేస్తున్న బిజెపి

పొన్నూరు, జూన్ 18,ప్రభాతవార్త: స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్)పేరిట దేశంలో కోట్లాది మంది పౌరసత్వాన్ని రద్దు చేస్తూ రక్తపాత రహిత రాజకీయ నరమేధం సృష్టించడమే బిజెపి ఎజెండా




అని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అందె దిలీప్ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమైన ఎస్ఐఆర్‌పై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ఏర్పాటు చేసిన సమావేశంలో దిలీప్ మాట్లాడుతూ ఇప్పటికే దశంలోని అన్ని ప్రజాస్వామ్య పరిరక్షణ సంస్థల విశ్వసనీయతను నిర్లజ్జగా దెబ్బతీస్తూ వచ్చిన ఆర్ఎస్ఎస్,బిజెపిలు ఇప్పుడు దేశంలో ఎస్ఐఆర్ పేరిట మరో రోత ప్రకియకు పూనుకున్నారన్నారు.ఒక్కో రాష్ట్రంలో ఒక్కోలాగ ఎస్ఐఆర్ విధి విధానాలు మారటం దేనికి సంకేతమో అధికారుల వద్ద సమాధానాలు లేకపోవడం, ఈ ప్రక్రియ ఎంత అప్రజాస్వామికంగా జరగనుందో తెలుస్తుందన్నారు.

## విజ్ఞాన్స్ విద్యార్థికి పీహెచ్‌డీ ప్రదానం

పొన్నూరు, జూన్ 18,ప్రభాతవార్త: చేబ్రోలు మండలం, వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ పరిధిలోని ఈసీఈ విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థి మంచాల వెంకట సుబ్బారావుకు పీహెచ్‌డీ పట్టా ప్రదానం చేసినట్లు యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కేవీ క్రిష్ణకిషోర్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ డిజైన్ ఆఫ్ లో-పవర్ హై-స్పీడ్ బిట్-స్లైస్ 32-బిట్ ఏఎల్‌యూ యూజింగ్ ఎక్స్-వోఆర్, ఎక్స్-ఎన్‌వో ఆర్ లాజిక్ బేస్డ్ హైబ్రిడ్ ఫుల్ యాడర్ సెల్




ఫర్ ఐఓటీ అప్లికేషన్స్ అనే అంశంపై వెంకట సుబ్బారావు విజయవంతంగా పరిశోధన పూర్తి చేసినట్లు చెప్పారు. ఈ పరిశోధనకు విజ్ఞాన్స్ ఈసీఈ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సత్యజీత్ సాహు గైడ్‌గా, బెంగుళూరులోని అలయన్స్ యూనివర్సిటీ ఈసీఈ విభాగం ప్రొఫెసర్ జీ.రమణమూర్తి కో-గైడ్‌గా వ్యవహరించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఈయన గుంటూరు పెదపలకలూరు సమీపంలోని విజ్ఞాన్ నిరుల ఇంజనీరింగ్ కళాశాల ఈసీఈ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. మంచాల వెంకట సుబ్బారావును విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వివిధ విభాగా డీన్లు, అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

## స్పెషల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్‌గా ఎం.మురళీమోహన్‌దాస్



పొన్నూరు, జూన్ 18,ప్రభాతవార్త: పొన్నూరు పట్టణంలో స్పెషల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ రెండవ తరగతి నూతన కోర్టును గురువారం ప్రారంభించారు. నూతన మెజిస్ట్రేట్‌గా ఎం.మురళీమోహన్‌దాస్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి.రుక్మిణి మాట్లాడుతూ పొన్నూరు పట్టణానికి రెండవ తరగతి మెజిస్ట్రేట్ కోర్టు మంజూరు కావడం సంతోషదాయకమన్నారు. ఈ సందర్భంగా నూతన మెజిస్ట్రేట్‌ను బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ బాజిసాహెబ్, ఎజిపి వట్టికూటి లీలాప్రసాద్, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పొందుగల జయరాజు, న్యాయవాదులు గండు శ్రీనివాసరావు, బి.అమ్మరావు, చిల్లర నాగరాజు, మగ్బుల్‌బేగ్, ఎంపిఆర్‌వి ప్రసాద్, వర్ధన్, డి.కోటేశ్వరరావు, బేతాళ ప్రకాష్, న్యాయవాది గుమస్తాలు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## వ్యాస మహర్షి పురస్కారానికి ఎస్‌బిఎన్‌వి సుబ్రహ్మణ్యం ఎంపిక



పొన్నూరు, జూన్ 18,ప్రభాతవార్త: రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులకు హిందూ ఉపాధ్యాయ సమితి ఇచ్చే వ్యాస మహర్షి పురస్కారానికి పట్టణానికి చెందిన ఎస్‌బిఎన్‌వి సుబ్రహ్మణ్యం ఎంపికయినట్లు హిందూ ఉపాధ్యాయ సమితి జాతీయ అధ్యక్షుడు మహేష్ దేగల తెలిపారు. బాపట్ల జిల్లా ఎంపియుపిఎస్ కొమరవోలు ఉపాధ్యాయుడు సుబ్రహ్మణ్యం ఎంపికయ్యారన్నారు. జాతీయవాద ఉత్తమ ఉపాధ్యాయులకు రాష్ట్రస్థాయి వ్యాస మహర్షి పురస్కారాలు, హిందూ వీరులకు హైందవ శ్రేష్ఠ పురస్కారాల ప్రధానోత్సవం జూలై 26న రాజమహేంద్రవరంలో జరుగుతుందన్నారు. సుబ్రహ్మణ్యంకు పురస్కారం అందజేస్తారని నిర్వాహకులు తెలిపారు.

## ఇంటర్మీడియెట్ సప్లమెంటరీలో వివేకా విజయకేతనం

పొన్నూరు, జూన్ 18,ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం గురువారం ప్రకటించిన ఇంటర్మీడియెట్ సప్లమెంటరీ, బెటర్‌మెంట్ పరీక్షా ఫలితాల్లో మరోసారి వివేకా విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించారని డైరెక్టర్ ఉప్పల సుకుమార్‌బాబు తెలిపారు. సీనియర్ ఇంటర్ విభాగంలో పఠాన్ సుహానా-992



మార్కులతో తన ర్యాంకును మెరుగు పరచుకున్నట్లు చెప్పారు. సుహాన ఇటీవలే వెలువడిన ఐఐటి పరీక్షా ఫలితాల్లో ఐఐటి పాట్నాలో సీటు సాధించారన్నారు. అదేవిధంగా నాదెండ్ల కృష్ణప్రియ-991మార్కులతో ప్రతిభను కనబరచినట్లు చెప్పారు. జూనియర్ ఇంటర్‌లో హర్షిణి తుత్తూరి-466మార్కులతో రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించగా హేమ కార్తికేయ, ఫుజైల్ అహమ్మద్-465మార్కులు సాధించారన్నారు. జూనియర్ బైపీసి విభాగంలో జెసియా సుల్తానా-450మార్కులతో రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించారన్నారు డైరెక్టర్ ఉప్పల సుకుమార్‌బాబు మాట్లాడుతూ విద్యార్థుల క్రమశిక్షణ, తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల శిక్షణ ద్వారా మెరుగైన ఫలితాలు సాధించామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డీన్ బోసు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ , స్కూల్ ఇన్‌చార్జి సుబ్బారావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## బీచ్ షాక్ పేరుతో మద్యం విక్రయాలు.. ప్రజల ప్రాణాలతో చెలగాటమే!

బాపట్ల,జూన్18,ప్రభాతవార్త,ప్రతినిధి: అభివృద్ధి పేరుతో పర్యాటక ప్రాంతాల సంస్కృతిని నాశనం చేస్తూ,బీచ్ షాక్‌ల పేరిట సూర్యలంక తీరంలో మద్యం విక్రయాలకు అనుమతులివ్వడం పర్యాటకుల ప్రాణాలతో చెలగాటమాడటమేనని సీపీఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సి.హెచ్.గంగయ్య తీవ్రంగా మండిపడ్డారు. గురువారం బాపట్లలోని ప్రజాసంఘాల కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బాపట్ల పరిసర ప్రాంతాల్లోని సూర్యలంక బీచ్‌ను అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.97 కోట్ల నిధులు మంజూరు చేయడం, ఆ దిశగా పనులు జరగడాన్ని సీపీఎం తరఫున స్వాగతిస్తున్నామన్నారు. అయితే, ఇదే తరుణంలో గోవా సంస్కృతిని ఇక్కడికి తీసుకువస్తామనే నెపంతో.. బీచ్ షాక్‌ల పేరుతో సూర్యలంకలో రెండు వైన్ షాపులు ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 363 జారీ చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. దూరప్రాంతాల నుంచి వేలాదిమంది పర్యాటకులు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఆహ్లాదకరమైన, ప్రశాంత వాతావరణంలో గడపడానికి సూర్యలంక తీరానికి వస్తుంటారని ఆయన గుర్తుచేశారు. ఇటువంటి పవిత్రమైన పర్యాటక స్థలంలో బార్ షాపులు, మద్యం దుకాణాలు ఓపెన్ చేస్తే ఇప్పటివరకు ఉన్న ప్రశాంతత పూర్తిగా దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం



చేశారు. గతంలో మద్యం సేవించి సముద్రంలోకి దిగి ఎంతోమంది ప్రాణాలు కోల్పోయి, వారి కుటుంబాలు రోడ్డున పడ్డ ఉదంతాలను ప్రభుత్వం మరువరాదని హెచ్చరించారు. ప్రజల ప్రాణాల కంటే ప్రభుత్వానికి ఆదాయమే ముఖ్యమా? అని గంగయ్య ప్రశ్నించారు. బాపట్ల పట్టణంతో పాటు తీర ప్రాంతాల్లో ఇప్పటికే గంజాయి, మద్యం విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నా అధికారులు, పాలకులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ఈ మధ్య కాలంలో కొన్ని రిసార్టుల్లో విచ్చలవిడిగా వ్యభిచార గృహాలు నడుస్తున్నాయని, మద్యం, గంజాయి తోడైతే మహిళలకు, మైనర్ బాలికలకు రక్షణ కరువవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే స్పందించి వివాదాస్పద జీవో నెంబర్ 363ను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో ప్రజాసంఘాలతో కలిసి పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బాపట్ల జిల్లా ఐద్వా కార్యదర్శి సుభాషిని, సీపీఎం నాయకులు కె. శరత్ తదితరులు పాల్గొన్నారు.

